నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644


**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

ఉప్పునున్న కూర యొప్పదు రుచులకు
అప్పువలన బ్రతుకునాగమౌను
ఉప్పు, అప్పులెల్ల తిప్పలు దెచ్చును
తెలివితోడ మెదలు తెరువునందు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 21 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 26-05 -2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

## ఆదానీ, అంబానీలను మించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు
- సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి
- రుణపరిమితి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నాం
- రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
- వర్చువల్ గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సింఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,
తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

-మిగతా 2 లో





# పదవుల కోసం వారు అక్కర్లేదు

- పార్టీ కోసం, ఏపీ అభివృద్ధి కోసం పనిచేయండి
- ఎదుటి వారి విమర్శలను సహించడానికి లేము
- అవసరమైతే తాట తీస్తాం: పవన్ హెచ్చరిక

అమరావతి,
:పదవులు వచ్చిన తర్వాత చాలా మంది జనసేన నాయకులు మెత్తబడి పోయారని, అలాంటి నాయకులు జనసేనకు అవసరం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 'మీ ఎదుగుదల కోసం నన్ను వాడుకోవద్దు. శత్రువులు బయట ఎక్కడో లేరు.. మన పార్టీలోనే ఉన్నారు' అంటూ పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేనలో ఉండగలిగేవాళ్లు మాత్రమే పార్టీలో ఉండండి అని స్పష్టం చేశారు. తాను టీడీపీ కోసం కాదు.. రాష్ట్రం కోసం సర్దుకుపోతున్నా.. అంటూ వ్యాఖ్యానించారు. ఇకపై జనసేన కట్టుదిట్టంగా వ్యవహరిస్తుందని, వ్యక్తిగతంగా విమర్శిస్తే అదే స్థాయిలో

-మిగతా 2 లో



# పెట్రో మంట

- మరోసారి పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు
- పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు
- పది రోజుల్లో నాలుగో సారి ధరలకు రెక్కలు
- సామాన్యుడిపై పెనుభారం.. మోడీ సర్కారుపై జనాగ్రహం

న్యూఢిల్లీ
కేంద్రంలోని మోడీ సర్కారు దేశ ప్రజలకు విడతలవారీగా షాక్‌లు ఇస్తోంది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచింది. పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరగడంతో సామాన్య ప్రజలకు అదనపు భారం తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం తాజాగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. లీటర్ పెట్రోల్‌పై రూ. 2.61, లీటర్ డీజిల్‌పై రూ. 2.71 పెంచింది. పెరిగిన ఈ కొత్త ధరలు సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి

-మిగతా 2 లో



# బీజేపీవి రాజకీయ డ్రామాలు

- ఒక వైపు పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజల నడ్డి విరుస్తోంది
- మరో వైపు రైతులకు భరోసా అంటూ బస్సు యాత్ర
- రైతు వ్యతిరేక విధానాలతో ప్రజలకు మోసం
- రైతు పండించే ప్రతి గింజ కేంద్రం కొనాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

2




# మోదీ..గ్రేట్

- భారత్ అతి శక్తివంతమైన దేశమన్న ట్రంప్
- మోదీ నాయకత్వంలో వేగంగా అభివృద్ధి
- మోదీకి ఏ సాయం కావాల్సినా చేస్తాం
- నేరుగా నాకే ఫోన్ చేయవచ్చు
- భారత్ అమెరికాకు నమ్మకమైన మిత్రుడంటూ కామెంట్
- ప్రధానిని ప్రశంసలతో ముంచెత్తిన పెద్దన్న

2

## ఒక్క రక్తపు చుక్కతో క్యాన్సర్ నిర్ధారణ..



2

# హైదరాబాద్‌లో రిహాబ్ మాఫియా?

## పునరావాసం పేరుతో వ్యాపారం..

ప్రత్యేక పరిశోధనాత్మక కథనం

పిల్లల మానసిక వికాసం, ఫిజియోథెరపీ, ప్రత్యేక శిక్షణ కేంద్రాల ముసుగులో అక్రమ నిర్వహణ?

- వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ శూన్యం...
- రోగుల భద్రత, పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకం

హైదరాబాద్, మే 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)
హైదరాబాద్ మహానగరంలో రిహాబిలిటేషన్ సెంటర్లు ఇప్పుడు కేవలం మద్యపానం, మాదకద్రవ్యాల వ్యసనాలకు చికిత్స అందించే కేంద్రాలకే పరిమితం కావడం లేదు. "చిన్నారుల మానసిక వికాస కేంద్రం", "బిహేవియరల్ థెరపీ సెంటర్", "చైల్డ్ డెవలప్‌మెంట్ క్లినిక్", "ఫిజియోథెరపీ అండ్ రిహాబ్ సెంటర్", "ఆటిజం కేర్ హబ్", "స్పెషల్ ఎడ్యుకేషన్ సెంటర్", "న్యూరో రిహాబిలిటేషన్ క్లినిక్" వంటి పేర్లతో వందలాది సంస్థలు నగరమంతా విస్తరిస్తున్నాయి. అయితే వీటిలో ఎన్ని కేంద్రాలు ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్నాయి? ఎన్ని కేంద్రాల్లో అర్హత కలిగిన నిపుణులు ఉన్నారు? అనే ప్రశ్నలకు సమాధానం కనిపించడం లేదు.ఒకప్పుడు ఆసుపత్రులకు అనుబంధంగా మాత్రమే ఉండే పునరావాస సేవలు ఇప్పుడు లాభదాయక వ్యాపారంగా మారాయని వైద్య వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ముఖ్యంగా పిల్లల్లో ఆటిజం, హైపర్ యాక్టివిటీ, లెర్నింగ్ డిజేబిలిటీ, స్పీచ్ సమస్యలు, మానసిక వికాస లోపాలు వంటి అంశాలపై తల్లిదండ్రుల్లో పెరిగిన అవగాహనను కొందరు వ్యాపార అవకాశంగా మలుచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

-మిగతా 2 లో



# పెట్రో మంట

మొదటి తరువాయి

దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. అయితే ఇది పది రోజుల వ్యవధిలో జరిగిన నాలుగో ధరల పెంపు కావడం గమనార్హం. దేశంలో వరుసగా పెరుగుతున్న ఇంధన ధరలతో ఇప్పటికే సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, తాజా పెంపు మరింత భారాన్ని మోపనుంది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు దాదాపు రూ.8 వరకు పెరిగాయి.

వివిధ నగరాల్లో పెరిగిన ధరలు ఇలా

తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12కు చేరుకోగా, డీజిల్ ధర రూ.95.20కు పెరిగింది. ముంబయిలో లీటర్ పెట్రోల్ ధర రూ.111.18కి, డీజీల్ ధర రూ.97.83కి చేరింది. బెంగళూరులో లీటర్ పెట్రోల్ ధర రూ.110.93కి, డీజీల్ ధర రూ.98.80కి పెరిగింది. చెన్నైలో లీటర్ పెట్రోల్ ధర రూ.107.77కు, డీజీల్ ధర రూ.99.55కు ఎగబాకింది. కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర రూ.113.47కి, డీజీల్ ధర రూ.99.82కి చేరింది. ఇక తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్‌పై రూ.2.88 పెరిగి.. ధర రూ.115.73కి చేరుకుంది. లీటర్ డీజిల్‌పై కూడా రూ.2.88 పెరిగి.. ధర రూ.103.82కు ఎగబాకింది. మరోవైపు ఏపీలోని విజయవా డలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.75కి, లీటర్ డీజిల్ ధర రూ.105.43కు చేరింది.


# పదవుల కోసం వారు అక్కర్లేదు

మొదటి తరువాయి

బదులిస్తామని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఇకపోతే కుల రాజకీయాలు, ప్రత్యర్థి పార్టీల విమర్శలు, పార్టీ అంతర్గత పరిస్థితులపై జనసేన పార్టీ సమావేశంలో ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో రాజకీయాలు చాలా సాఫీగా సాగిపోయాయని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అక్కడి రాజకీయాలను చూస్తే అసూయ కలిగేంత సులభంగా జరిగాయని అన్నారు. తాను పదేపదే కులం గురించి మాట్లాడుతున్నానని కొందరు విమర్శిస్తున్నారని పేర్కొన్న పవన్.. తాను ఎప్పుడైనా కుల నాయకుడినని చెప్పానా? మిగతా పార్టీ నేతలు కులం గురించి మాట్లాడటం లేదా? అంటూ ప్రశ్నించారు. కులాలను రెచ్చగొట్టే మనస్తత్వం సమాజానికి మంచిది కాదని సూచించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన చర్చలపై కూడా ఆయన స్పందించారు. 'నేను అమిత్ షాతో మాట్లాడిన విషయాలు బయటవాళ్లకు ఎలా తెలుస్తాయి? ఏపీ బీజేపీ నేతలు ఎందుకు స్పందించలేదు? వైసీపీ నేత జైలుకెళ్లాలని నేను ఎందుకు కోరుకుంటాను? ఒక నాయకుడు జైలుకెళ్తే జనసేన ఎదుగుతుందా?' అంటూ వ్యాఖ్యానించారు. కేంద్ర హోంమంత్రితో రాష్ట్ర అభివృద్ధి అంశాలపైనే మాట్లాడతాం.. ఇలాంటి ఆరోపణలు చేయడం వ్యవస్థను అవమానపరచడమేనని పవన్ అన్నారు. తాను అమిత్ షాను కలిసింది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసమేనని స్పష్టం చేశారు. 'నేను అన్నింటికీ తెగించే రాజకీయాల్లోకి వచ్చాను. శత్రువు బలంగా ఉన్నప్పుడే ఎదుర్కొంటా.. బలహీనులను కాదు' అని వ్యాఖ్యానించారు. 'మాకు కూడా కోపాలు, బాధలు ఉంటాయి. చూస్తూ ఊరుకుంటామని అనుకోవద్దు. దేనికైనా ఒక హద్దు ఉంటుంది.. భరిస్తాం.. సహిస్తాం.. అవసరమైతే తాట తీస్తాం' అంటూ పవన్ హెచ్చరించారు.

# ఒక్క రక్తపు చుక్కతో క్యాన్సర్ నిర్ధారణ..

**-సరికొత్త పరికరాన్ని అభివృద్ధి చేసిన చైనా పరిశోధకులు**
**-10 వేల రెట్లు ఎక్కువ కచ్చితత్వం**



**న్యూఢిల్లీ,**
క్యాన్సర్ నిర్ధారణలో వైద్యులు ప్రస్తుతం ఉపయోగిస్తున్న వైద్య పరికరాల పరిమాణం చాలా పెద్దది. చైనా సైంటిస్టులు.. దీనిని చేతిలో పట్టే ఒక పరికరంగా కుదించగలిగారు. 'నానోఫొటోనిక్ బయోసెన్సింగ్' అనే పరికరాన్ని చైనాలోని (హాంగ్‌జౌ) 'వెస్ట్‌లేక్ వర్సిటీ' సైంటిస్టులు తయారుచేశారు. దీనిపై 'నేచర్ ఫొటోనిక్స్' జర్నల్ కథనం ప్రకారం, ఒకే ఒక్క రక్తపు చుక్కను తీసుకొని.. 'నానోఫొటోనిక్ బయోసెన్సింగ్' పరికరం అత్యంత కచ్చితమైన ఫలితాన్ని ఇస్తుంది. సంప్రదాయ పద్ధతుల్లో ఉండే కచ్చితత్వంతో పోల్చితే..దీంట్లో 10,000 రెట్లు ఎక్కువ కచ్చితత్వంతో క్యాన్సర్‌ను గుర్తించొచ్చు. మన శరీరంలో క్యాన్సర్ ఉందా? లేదా? అన్నది చెప్పేది రక్తమే. దీంట్లో వచ్చిన మార్పులను గుర్తించడానికి కాంతి కిరణాలను ఉపయోగిస్తారు. దీనిని విశ్లేషించడానికి చైనా శాస్త్రవేత్తలు ప్రత్యేకమైన 'త్రీడీ చిప్'ను ఉపయోగించారు. రక్తంలోని సూక్ష్మమైన మార్పును గుర్తించటంలో 'నానోఫొటోనిక్ బయోసెన్సింగ్' పరికరానికి ఈ త్రీడీ చిప్ దోహదపడుతుంది.

# కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

మొదటి తరువాయి

సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# మోదీ..గ్రేట్

**-భారత్ అతి శక్తివంతమైన దేశమన్న ట్రంప్**
**-మోదీ నాయకత్వంలో వేగంగా అభివృద్ధి**
**-మోదీకి ఏ సాయం కావాల్సినా చేస్తాం**
**-నేరుగా నాకే ఫోన్ చేయవచ్చు**
**-భారత్ అమెరికాకు నమ్మకమైన మిత్రుడంటూ కామెంట్**
**-ప్రధానిని ప్రశంసలతో ముంచెత్తిన పెద్దన్న**



**న్యూఢిల్లీ,**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశంసలు కురిపించారు. భారత్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. మోదీ చాలా గ్రేట్.. ఆయనకు తాను పెద్ద అభిమానిని.. అంటూ ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశం ఏది కావాలనుకుంటే.. దానిని సాధించి తీరుతుంది.. అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

ఢిల్లీలో అమెరికా స్వాతంత్ర్య వేడుకలు

అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలు ఢిల్లీలో కలర్‌ఫుల్‌గా జరిగాయి. ఈ నేపథ్యంలో భారత్ పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ శాఖ మంత్రి రూబియో ఆధ్వర్యంలో ఆదేశ ఎంబసీ ఢిల్లీలో ఓ కార్యక్రమం నిర్వహించింది. ఈ క్రమంలో భారతలోని యూఎస్ రాయబారి సిరియా గోర్, అలాగే రూబియోతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ లైవ్ ఫోన్‌కాల్‌లో మాట్లాడారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ రికార్డులు సృష్టిస్తోందన్నారు. ఇక, రూబియో... అమెరికా చరిత్రలోనే గొప్ప విదేశాంగ కార్యదర్శిగా నిలుస్తారని ట్రంప్ అన్నారు. ఇక, భారత్ అంటే తనకు ఎంతో ఇష్టమని.. ప్రధాని మోదీ గొప్ప నాయకుడు.. తనకు మంచి స్నేహితుడు అంటూ చెప్పుకొచ్చారు. అంతేకాదు, నరేంద్రమోదీకి తాను పెద్ద అభిమానిని అన్నారు. భారత్‌కు ఎప్పుడైనా సహాయం అవసరమైతే.. తనను వందశాతం నమ్మవచ్చునన్నారు. భారత్‌కు ఏ అవసరం వచ్చినా.. నేరుగా తనకు కాల్ చేయవచ్చునన్నారు. ప్రధాని మోదీకి తన తరపున శుభాకాంక్షలు చెప్పాలని.. ఆయనకు తాను పెద్ద ఫ్యాన్‌ని అంటూ ఫోన్‌కాల్ ముగించారు.

త్వరలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం

ఇదిలాఉంటే.. అమెరికా, భారత్‌లు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు దగ్గరలోనే ఉన్నాయని.. ఇది త్వరలోనే జరుగుతుందని మార్కో రూబియో ఆదివారం వెల్లడించారు. ఈ ఒప్పందంతో ఇరుదేశాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అంతకుముందు రూబియో.. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి జైశంకర్‌తో భేటీ అయ్యారు.

# బీజేపీవి రాజకీయ డ్రామాలు

**-ఒక వైపు పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజల నడ్డి విరుస్తోంది**
**-మరో వైపు రైతులకు భరోసా అంటూ బస్సు యాత్ర**
**-రైతు వ్యతిరేక విధానాలతో ప్రజలకు మోసం**
**-రైతు పండించే ప్రతి గింజ కేంద్రం కొనాలి**
**-మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్**



**తెలంగాణ బ్యూరో ప్రతినిధి :**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్య ప్రజల నడ్డి విరుస్తూ, ప్రజల అసలు సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకు రైతు గోస -- బీజేపీ భరోసా పేరుతో బస్సు యాత్రలు చేపట్టడం పూర్తిగా రాజకీయ డ్రామా అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెల్చి చెప్పారు. సోమవారం మంత్రి పొన్నం ఓ ప్రకటన విడుదల చేస్తూ... రోజురోజుకు పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావంతో రైతులపై సాగు వ్యయం భారీగా పెరిగిందన్నారు.. ట్రాక్టర్లు, మోటార్లు, రవాణా ఖర్చులు అన్నీ పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ రైతు సంక్షేమం గురించి మాట్లాడుతున్న బీజేపీ నిజంగా తెలంగాణ రైతులపై ప్రేమ ఉంటే పెట్రోల్ ధరలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పైవ త్రిడి తేవాలన్నారు రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడంలో కేంద్రం విఫలమైంది. కొనుగోలు చేసిన ధాన్యంలో బాయిల్డ్ రైస్ సాంక్షన్ చేయడంలో, లేవీ రైస్ కు అనుమతులు ఇవ్వడంలో సహకరించడం లేదని మండి పడ్డారు. ఇప్పటికి కేవలం 53.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మాత్రమే అనుమతి ఇచ్చింది. కానీ తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలగకుండా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉన్న 8 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేగంగా యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 21 కోట్ల గోనె సంచులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచాం. ఇప్పటివరకు తెలంగాణ ప్రభుత్వం 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.8,749 కోట్ల కనీస మద్దతు ధర చెల్లించిందన్నారు పొన్నం. వ్యవసాయ చట్టాల పేరుతో దేశవ్యాప్తంగా రైతులను ఇబ్బందులకు గురిచేసి, 700 మందికి పైగా రైతుల ప్రాణాలు పోయే పరిస్థితి తీసుకొచ్చిన బీజేపీ ఇప్పుడు రైతులకు భరోసా ఇస్తామని చెప్పడం నమ్మశక్యం కాదని. బడా పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తూ రైతులకు మాత్రం నయా పైస రుణమాఫీ చేయకపోవడం రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనం. అనిగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతులపై లాఠీచార్జీలు చేయించిన ఘటనలు దేశం చూసింది. రైతుల బాధలను పట్టించుకోని బీజేపీ నేతలు ఇప్పుడు రైతు ప్రేమ గురించి మాట్లాడటం కపట నాటకం అన్నారు. తెలంగాణలో పండిన మొత్తం ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో రిహాబ్ మాఫియా?

మొదటి తరువాయి

**ప్రతి కాలనీలో ఒక రిహాబ్ సెంటర్**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, కొండాపూర్, మియాపూర్, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, అల్వాల్, బోడుప్పల్, శంషాబాద్ ప్రాంతాల్లో గత కొన్నేళ్లుగా రిహాబ్, థెరపీ, చైల్డ్ డెవలప్‌మెంట్ కేంద్రాలు విపరీతంగా పెరిగాయి. కొన్నిచోట్ల నివాస గృహాలనే అద్దెకు తీసుకుని ఆసుపత్రి తరహా సేవలు అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

వైద్య అర్హతలు లేని వ్యక్తులు కూడా "థెరపిస్టు", "కౌన్సిలర్", "బిహేవియర్ స్పెషలిస్టు", "చైల్డ్ డెవలప్‌మెంట్ ఎక్స్‌పర్ట్" వంటి హోదాలతో సేవలు అందిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**భయాన్ని పెట్టుబడిగా మార్చుకుంటున్నారా?**

"మీ బిడ్డ ఇతర పిల్లలతో మాట్లాడటం లేదు", "ఆటిజం వచ్చే ప్రమాదం ఉంది", "మెదడు అభివృద్ధి మందగించింది", "ప్రత్యేక థెరపీ అవసరం" వంటి మాటలతో తల్లిదండ్రులను భయపెట్టి లక్షల రూపాయల ప్యాకేజీలు విక్రయిస్తున్న కేంద్రాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒక నెల థెరపీకి 20 వేల నుంచి 80 వేల వరకు, ఏడాది ప్రోగ్రామ్‌లకు ?3 లక్షల నుంచి ?10 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారు. చికిత్సకు సంబంధించి శాస్త్రీయ ఆధారాలు, ప్రభుత్వ గుర్తింపు, ఫలితాలపై స్పష్టత లేకపోయినా భారీ ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**ఫిజియోథెరపీ కేంద్రాల ముసుగులో రిహాబ్ వ్యాపారం**

ఫిజియోథెరపీ పేరుతో ప్రారంభమైన అనేక కేంద్రాలు ఇప్పుడు న్యూరో రిహాబిలిటేషన్, మానసిక పునరావాసం, ప్రవర్తనా చికిత్స, ప్రత్యేక విద్య, కౌన్సిలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయి. కానీ వీటికి అవసరమైన వైద్య బృందం, అత్యవసర వైద్య సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు ఉన్నాయా అనే అంశంపై ఎవరూ సమాధానం చెప్పడం లేదు.

కొన్ని కేంద్రాల్లో చిన్నారులను గంటల తరబడి ప్రత్యేక గదుల్లో ఉంచడం, తల్లిదండ్రులను లోపలికి అనుమతించకపోవడం, సీసీటీవీ వ్యవస్థలు లేకపోవడం వంటి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నిద్ర మత్తులో వైద్య ఆరోగ్యశాఖ?**

నగరంలో వందలాది రిహాబిలిటేషన్, థెరపీ, చైల్డ్ డెవలప్‌మెంట్ కేంద్రాలు పనిచేస్తున్నప్పటికీ వాటిపై సమగ్ర డేటా కూడా ప్రభుత్వ శాఖల వద్ద లేదని ఆరోగ్య రంగ నిపుణులు చెబుతున్నారు.

ఎన్ని కేంద్రాలకు అనుమతులు ఉన్నాయి? ఎన్ని కేంద్రాల్లో అర్హత కలిగిన వైద్యులు ఉన్నారు? ఎన్ని కేంద్రాలు తనిఖీలకు గురయ్యాయి? ఎన్ని కేంద్రాలపై ఫిర్యాదులు వచ్చాయి? వంటి ప్రాథమిక సమాచారం కూడా ప్రజలకు అందుబాటులో లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ నిబంధనలు, మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం, దివ్యాంగుల హక్కుల చట్టం, బాలల సంరక్షణ నిబంధనల అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**పిల్లల భవిష్యత్తుతో ప్రయోగాలు?**

అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే, ఈ కేంద్రాల్లో ఎక్కువగా సేవలు పొందుతున్నవారు చిన్నారులే. మాట్లాడటంలో ఆలస్యం, చదువులో వెనుకబాటు, ప్రవర్తనా సమస్యలు, ఆటిజం లక్షణాలు వంటి అంశాలతో వచ్చే పిల్లలపై శాస్త్రీయ ప్రమాణాలు లేని పద్ధతులు అమలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పిల్లల మానసిక స్థితి, భావోద్వేగ వికాసం, సామాజిక నైపుణ్యాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశాలు ఉన్నప్పటికీ పర్యవేక్షణ వ్యవస్థ కనిపించడం లేదు.

రాష్ట్రవ్యాప్త విచారణ అవసరం

వైద్య నిపుణులు, బాలల హక్కుల సంఘాలు, దివ్యాంగుల సంక్షేమ సంస్థలు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. రిహాబ్, థెరపీ, చైల్డ్ డెవలప్‌మెంట్, స్పెషల్ ఎడ్యుకేషన్, న్యూరో కేర్, బిహేవియర్ క్లినిక్ పేర్లతో నడుస్తున్న ప్రతి కేంద్రాన్ని పరిశీలించి అర్హతలు, అనుమతులు, సిబ్బంది వివరాలు, భద్రతా ప్రమాణాలను బహిర్గతం చేయాలని కోరుతున్నాయి.

**ప్రభుత్వం వెంటనే తీసుకోవాల్సిన చర్యలు**

- రాష్ట్రవ్యాప్తంగా రిహాబిలిటేషన్ కేంద్రాల సమగ్ర సర్వే.
-ప్రతి కేంద్రానికి యూనిక్ రిజిస్ట్రేషన్ వ్యవస్థ.
- అర్హత కలిగిన వైద్యులు, థెరపిస్టుల వివరాల ప్రజా ప్రదర్శన.
- పిల్లల భద్రత కోసం తప్పనిసరి సీసీటీవీ వ్యవస్థ.
- తల్లిదండ్రుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్.
- అనుమతులు లేని కేంద్రాలపై కఠిన చర్యలు.

పునరావాసం అనేది సేవ. కానీ అది నియంత్రణలేని వ్యాపారంగా మారితే బాధితుల ఆశలు, పిల్లల భవిష్యత్తు, కుటుంబాల ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. హైదరాబాద్‌లో పుట్టగొడుగుల్లా పెరుగుతున్న రిహాబిలిటేషన్ కేంద్రాలపై ప్రభుత్వం ఇప్పటికైనా సమగ్ర దృష్టి సారించకపోతే రాబోయే రోజుల్లో ఇది రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సామాజిక, వైద్య, న్యాయ సమస్యగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# నేటి రాశి ఫలాలు



**మేషరాశి**
ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. దైవచింతన పెరుగుతుంది. సన్నిహితులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. వ్యాపారాలలో స్వల్ప లాభాలను అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో కొంత అనుకూల వాతావరణం ఉంటుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. బాలింతలకు ఆకుకూరలు పంపిణీ చేస్తే శుభకరం

**వృషభరాశి**
అనుకున్న పనులు సమయానికి పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలలో ఆప్తుల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. వ్యాపారాలలో అంచనాలను అందుకుంటారు. సాధువులకు ఎర్ర వస్త్రాలు ఇస్తే శుభకరం

**మిధునరాశి**
స్థిరాస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. చేపట్టిన పనులు కొంత నెమ్మదిగా సాగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగమున అధికారులతో చర్చలు ఫలించవు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. సాధువులకు అన్నదానం శుభకరం

**కర్కాటకరాశి**
దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. పాత బాకీలు వసూలవుతాయి. ఉద్యోగమున అప్పగించిన బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు కలుగుతాయి. వ్యాపారమున మరింత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. వృద్ధులకు వేసే దాహం తీరిస్తే శుభకరం

**సింహరాశి**
ఇంటా బయట కొన్ని సమస్యలు ఇబ్బంది కలిగిస్తాయి. ధన పరంగా చికాకులు తప్పవు. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. దూరప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. వృత్తి వ్యాపారాలలో శుభవార్తలు అందుతాయి. ఉద్యోగస్తులు అధికారుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుంది. వృద్ధులకు అన్నదానం శు భకరం

**కన్యరాశి**
ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. నిరుద్యోగులు నూతన ఉద్యోగ అవకాశాలు పొందుతారు. మిత్రులతో దైవదర్శనం చేసుకుంటారు. దీర్ఘకాలిక వివాదాల నుంచి బయటపడతారు. వ్యాపారమున ప్రత్యర్థులు కూడా మిత్రులుగా మారతారు. నూతన వాహన యోగం ఉన్నది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. పక్షులకు దాహం తీరుస్తే శు భకరం

**తుల రాశీ**
చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. నిరుద్యోగ ప్రయత్నాలు కలసివస్తాయి. కుటుంబ సభ్యులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. దీర్ఘకాలిక ఋణబాధలు తొలగుతాయి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఉద్యోగస్తులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. పశువులకు పశుగ్రాస పెడితే శుభకరం.

**వృశ్చికరాశి**
దూరప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు తప్పవు. వ్యాపారాలు కొంత నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన పనులు మందగిస్తాయి. కొన్ని వ్యవహారాలు శ్రమతో గాని పూర్తి కావు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. గోమాతకు గుగ్గిళ్ళు పెడితే శుభకరం

**ధనస్సురాశి**
అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపించదు. సోదరులతో ఆస్తి వివాదాలు ఉంటాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ సభ్యుల నుంచి ఋణ ఒత్తిడి పెరుగుతుంది. ప్రయాణాలు వాయిదా వేస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. చీమకు చక్కెర పెడితే శుభకరం

**మకర రాశి**
గృహ నిర్మాణ విషయంలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకొని పాత విషయాలు చర్చిస్తారు. సమాజంలో పెద్దలతో పరిచయాలు విస్తృతమవుతాయి. విద్యార్థులకు నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపార ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. కాపులకు అల్పాహారం పెడితే శుభకరం

**కుంభరాశి**
ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో విచిత్రమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. దూరపు బంధువుల నుండి శు భవార్తలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో ఇబ్బందులను అధిగమిస్తారు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. వృద్ధులకు అన్నదానం శుభకరం

**మీనరాశి**
ఆస్తి తగాదాలు మరింత చికాకు కలిగిస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. బంధువులతో మాట పట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపించదు. దూర ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నత్తనడకన సాగుతాయి. దైవ చింతన పెరుగుతుంది. గ్రామ సింహాలకు బెల్లం అన్నం పెడితే శుభకరం

**రాశి ఫలితాలు నిపుణుల సలహాలతో అనుసరించాలి**

**శ్రీ కాలభైరవ ఉపాసకులు**
**దక్క జంబులయ్య (స్వామి )**
**9491163914**



## రైతుల కోసం రంగంలోకి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్వయంగా రంగంలోకి దిగారు.ఆదివారం గంగాధర మండలం మధురానగర్ వద్ద కరీంనగర్--జగిత్యాల జాతీయ రహదారిపై వెళుతున్న లారీలను ఆపి, కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం మిల్లులకు తరలించేందుకు సహకరించాలని లారీ యజమానులను కోరారు. అంతేకాకుండా తానే లారీలో కూర్చుని ధాన్యాన్ని కేంద్రాల నుండి మిల్లులకు తరలించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటామని, లారీ లోడింగ్ తర్వాత మిల్లుల్లో వెంటనే అన్‌లోడింగ్ జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ చేస్తూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.రైతుల సంక్షేమమే తన లక్ష్యమని, రైతుల ఇబ్బందులను తొలగించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యానికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## మారుతీనగర్‌లో తీరనున్న తాగునీటి సమస్యలు



**కరీంనగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గత కొన్ని సంవత్సరాలుగా మారుతీనగర్ గల్లీ ప్రజలు ఎదుర్కొంటున్న కలుషిత తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. మురుగునీరు కలిసిపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యను గుర్తించిన కార్పొరేటర్ తోట అనిల్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మున్సిపల్ ఏఈ, డిఈల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, నిరంతర కృషి చేసి కొత్త తాగునీటి పైప్‌లైన్ మంజూరు చేయించారు. ఈ క్రమంలో ఈరోజు తోట అనిల్ కొబ్బరికాయ కొట్టి అధికారికంగా పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై మారుతీనగర్ గల్లీ ప్రజలకు కలుషిత నీటి సమస్య ఉండదని, స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని భరోసా ఇచ్చారు. తమ ఏళ్లనాటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన కార్పొరేటర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గల్లీ ప్రజలు, కాలనీ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మారుతీనగర్ ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించేందుకు కొత్త పైప్‌లైన్ పనులు ప్రారంభమవడంతో ఉపశమనం లభించింది.

## గోనబోయినపల్లి గ్రామానికి బస్సు సర్వీసును పునరుద్ధరణచేయాలి

**-ఆర్టీసీ డీఎంకు గ్రామ నాయకుల వినతి.**



**దేవరకొండ మే 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్గొండ జిల్లా డిండి మండలం పరిధిలోని గోనబోయినపల్లి గ్రామానికి తక్షణమే ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరుతూ గ్రామ నాయకులు, ప్రజలు సోమవారం దేవరకొండ డిపో మేనేజర్ ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ, పాఠశాల లు నడిచినరోజులలో మాత్రమే బస్సులు నడుస్తాయని, వేసవి సెలవుల కారణంగా బస్సు సర్వీసులను నిలిపివేసారని అన్నారు.గ్రామంలో సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడం వల్ల వైద్యం కోసం మండల కేంద్రం అయిన డిండికి ,దేవరకొండ పట్టణానికి వెళ్లే రోగులు, వృద్ధులు మరియు కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం మరియు సాయంత్రం వేళల్లో బస్సు సర్వీసులను నడపాలని వారు కోరారు.
రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, ప్రమాదకర ప్రయాణాలు చేయాల్సి వస్తోందని డీఎం దృష్టికి తీసుకెళ్లారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించారు.. రూట్లను పరిశీలించి, త్వరలోనే గోనబోయినపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోనబోయినపల్లి గ్రామ ముఖ్య నాయకులు గడిగ అర్జున్, రాసాలబద్రి మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## దివ్యంగా మహిళకు స్వయం ఉపాధి భరోసా



**జవహర్‌నగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ చంద్రపురి బాలాజీనగర్ కాలనీలో నివసిస్తున్న దివ్యంగా వితంతువు మహిళ వరలక్ష్మికి స్వయం ఉపాధి భరోసా లభించింది. సుఖినోబావంతు ట్రస్ట్ మరియు పవన్ బాబు మోహన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.20 వేల విలువైన కిరాణా సామాగ్రితో కిరాణా షాపును సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ, “సుఖినోబావంతు ట్రస్ట్, పవన్ బాబు మోహన్ ట్రస్ట్ ఇచ్చిన సహాయం వల్ల నాకు జీవనాధారం లభించింది. ఇంతటి సహాయం అందించేందుకు సహకరించిన తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ, అలాగే రత్న ప్రభ, బానురెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు” అని తెలిపారు.కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సత్యవతి, వెంకటరమణ, జర్నలిస్టులు విజయ్ కుమార్, రాఘు తదితరులు పాల్గొన్నారు.

## మాల సంక్షేమ సంఘం భవనానికి అదనపు అంతస్తు నిధులు కేటాయించండి



**ఉప్పల్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చిలుకానగర్ మాల సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందమల్ల పరమేశ్వర్‌రెడ్డిని కలిసి సంఘ భవనానికి అదనపు అంతస్తు నిర్మాణానికి నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, “సాధ్యమైనంత త్వరగా నిధులు మంజూరు అయ్యేలా అధికారులతో మాట్లాడతాను” అని హామీ ఇచ్చారు. అనంతరం సంఘ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మంచినీళ్ల శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు కొండ్రా రాములు, పడిగం రాంనర్సయ్య, వజ్జాల ఆంజనేయులు, కొమ్ము రాజశేఖర్, మేకల అనిల్ కుమార్, మన్నెపు శ్రీనివాస్, సుదర్శన్, బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి. కిష్టయ్య, దేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


## సీఐ జానకిరామ్‌రెడ్డిని కలిసిన సురేష్



**తలకొండపల్లి, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తలకొండపల్లి యువ నాయకుడు పెరుమాండ్ల సురేష్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ వి. జానకిరామ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ, డ్రగ్స్, మత్తు పదార్థాలపై కఠిన చర్యలు, రోడ్డు ప్రమాదాల నివారణకు కౌన్సిలింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సీసీ కెమెరాల నిఘాను బలోపేతం చేసి, పనిచేయని కెమెరాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు.అమాయక ప్రజలపై తప్పుడు కేసులు నమోదు కాకుండా న్యాయం చేయాలని, పోలీస్ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని సురేష్ అభ్యర్థించారు. తలకొండపల్లి పోలీస్ స్టేషన్ కమిషనరేట్‌లో నెంబర్ వన్‌గా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వెల్దండలో గాలి వానలతో చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం

**చెరుకూరులో కరెంటు వైర్లు నేలపై పడిపోవడంతో ప్రజల్లో భయాందోళన**





**వెల్దండ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల కేంద్రంలో సోమవారం జోరుగా వీస్తున్న గాలి వానలతో రోడ్లపై చెట్లు విరిగిపడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గాలి వానల తీవ్రతతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు.చెరుకూరు గ్రామంలో చెట్లు విరిగిపడడంతో కరెంటు వైర్లు నేలపై పడిపోయాయి. ఈ దృశ్యం చూసిన చుక్కాపూర్ గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

# విద్యా రంగ అభివృద్ధి దిశగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ,ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు

**గంగాధర, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో విద్యా రంగ అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పలు కీలక నిర్ణయాలు అమలవుతున్నాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు.గంగాధర మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను మంజూరు చేసిన సందర్భంగా మధురానగర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో మొదటి శాసనసభ సమావేశాల్లోనే డిగ్రీ కళాశాల మంజూరు కోరినట్లు గుర్తుచేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్గా తీర్చిదిద్దుతున్నామని, ఇందులో భాగంగా రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ చొప్పదండిలో, రామడుగులో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్, గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల




ఏర్పాటు చేశామని తెలిపారు. మిగతా మండలాల్లో కూడా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తాం. ప్రజలు సహకరిస్తే చొప్పదండి అన్ని రంగాల్లో ముందుకు సాగుతుంది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ తోట కరుణాకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముద్దం నగేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, మాజీ జెడ్పిటిసి సభ్యుడు సత్తు కనుకయ్య, సర్పంచులు వేముల భాస్కర్, రామిడి రాజిరెడ్డి, బారాజు ప్రభాకర్ రెడ్డి, రాచమల్ల రవి, బాసవేణి శ్రీనివాస్, దాసరి శంకరయ్య, చందం ఆంజనేయులు, బిర్లా ఆనందం, కాంగ్రెస్ నాయకులు గోగురి మహిపాల్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, పడాల రాజన్న, కర్ర విద్యాసాగర్ రెడ్డి, మంత్రి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.చొప్పదండి నియోజకవర్గంలో విద్యా రంగం అభివృద్ధి కొత్త దశలోకి అడుగుపెడుతోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు.

## తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని టీఆర్ఎస్ డిమాండ్



**కరీంనగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఉద్యమాలకు ఖిల్లాగా నిలిచిన కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం లేకపోవడం విచారకరమని తెలంగాణ రక్షణ సేన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 2న జరగనున్న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం లోపు నగరంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి కరీంనగర్ నగరంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి. ఉద్యమాలకు కేంద్రబిందువైన ఈ ప్రాంతంలో విగ్రహం ఏర్పాటు చేయడం ప్రజల భావోద్వేగాలకు గౌరవం తెలిపినట్లవుతుంది అని పేర్కొన్నారు.కరీంనగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు కోసం రక్షణ సేన పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

## శాతవాహన హోటల్ మేనేజ్‌మెంట్ పరీక్ష వాయిదా




**కరీంనగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఈద్–ఉల్–అజ్హా (బక్రీద్) కారణంగా మే 28న జరగాల్సిన హోటల్ మేనేజ్‌మెంట్ ద్వితీయ సెమిస్టర్ పరీక్ష అకామడేషన్ ఆపరేషన్స్ -- II వాయిదా పడింది.పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి. సురేష్ కుమార్ ప్రకటనలో, ఇంతకుముందు ప్రకటించిన సమయాల ప్రకారమే ఎటువంటి మార్పు లేకుండా అదే పరీక్షను ఆయా కేంద్రాలలో జూన్ 5న నిర్వహిస్తామని తెలిపారు.ప్రజా సంబంధాల అధికారి, శాతవాహన విశ్వవిద్యాలయం. విద్యార్థులు కొత్త తేదీ ప్రకారం పరీక్షకు హాజరుకావాలని విశ్వవిద్యాలయం సూచించింది.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్వర్ డౌన్


**- తీవ్ర అవస్థలు ఎదురుకుంటున్న ప్రజలు**



**కరీంనగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత మూడు రోజులుగా సర్వర్ పనిచేయకపోవడంతో ఆన్‌లైన్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తీవ్రంగా ఆలస్యమై, కార్యాలయానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, కొనుగోలుదారులు ఈ భానుడి భగభగలకు తీవ్ర ఎండల్లో కార్యాలయం చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడ్డారు. కనీసం కూర్చోవడానికి సీట్లు, తాగడానికి తాగునీటి వసతి కూడా లేకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం సబ్ రిజిస్ట్రార్ హాజరుకావడంతో ఎట్టకేలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మళ్లీ ప్రారంభమైంది.సర్వర్ సమస్యలతో ప్రజలు అవస్థలు పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## న్యాయవాది ఖాజా మొహినుద్దీన్ హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తూ న్యాయవాదుల నిరసన




**కరీంనగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

న్యాయవాది ఖాజా మొహినుద్దీన్ హత్య ఘటనను తీవ్రంగా నిరసిస్తూ కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులు భారీ నిరసన చేపట్టారు.ఈ దారుణ హత్యకు కారణమైన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో న్యాయవాదుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే బాధితుడి కుటుంబానికి పూర్తి న్యాయం జరగాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.న్యాయవాదుల భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని నిరసనలో పాల్గొన్న వారు స్పష్టం చేశారు.

## విశ్రాంత ఉద్యోగుల బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆర్టీసీ సారథ్య కమిటీ డిమాండ్




**కరీంనగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సారథ్య కమిటీ పిలుపు మేరకు కరీంనగర్ జోనల్ వర్క్‌షాప్‌లో రిటైర్డ్ ఉద్యోగులు సమావేశమై తమకు రావలసిన బకాయిలను సత్వరమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వర్క్‌షాప్ మేనేజర్ ప్రణీత్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.రిటైర్మెంట్ అయ్యి సంవత్సరాలు గడిచినా లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు చెల్లించడం లేదని, 2017 సంవత్సరపు పే స్కేలు ఏరియర్స్ కూడా ఇప్పటికీ ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2013 నుండి 2017 వరకు జీతభత్యాల పెంపు రేట్లను ప్రావిడెంట్ కమిషనర్‌కు సకాలంలో పంపకపోవడం వలన పెన్షన్ మొత్తాలు రాకుండా కాలయాపన జరుగుతోందని ఆరోపించారు.ఇన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని, అన్ని యూనిట్లలో రిటైర్డ్ ఉద్యోగులు విజ్ఞప్తి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అదేవిధంగా కలెక్టర్ ప్రజా పాలన గ్రీవెన్స్ సెల్‌లో కూడా ఈ నెలలో తమ సమస్యలను తెలియజేసినట్లు పేర్కొన్నారు.విశ్రాంత ఉద్యోగుల బకాయిలను తక్షణమే చెల్లించి న్యాయం చేయాలని సారథ్య కమిటీ పట్టుదలగా డిమాండ్ చేసింది.

## గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని విజ్ఞప్తి

**మర్రిగూడ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



మునుగోడు నియోజకవర్గ మైనార్టీ సంఘం కోఆర్డినేటర్ అబ్దుల్ రజాక్ గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, “భారతదేశంలో కోట్లాదిమంది హిందువులు గోవును పవిత్రంగా భావిస్తున్నారు. వారి మనోభావాలను గౌరవిస్తూ గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి” అని అన్నారు.అదేవిధంగా రాబోయే బక్రీద్ సందర్భంగా ముస్లిం పెద్దలు గోవులను బలి ఇవ్వకూడదని తీసుకున్న నిర్ణయం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

## డంపింగ్ యార్డ్‌ను వెంటనే తొలగించాలి

**- సీపీఎం డిమాండ్**




**కరీంనగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నగరంలోని డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీకి మేయర్ పదవి ఇస్తే నెల రోజుల్లోనే డంపింగ్ యార్డ్‌ను తొలగిస్తామని హామీ ఇచ్చి, నాలుగు నెలలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదని మండిపడ్డారు.అధికారులు, పాలకులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కరీంనగర్ ప్రజల ఆరోగ్యం కోసం డంపింగ్ యార్డ్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం పట్టుదలగా డిమాండ్ చేస్తోంది.

## చెవిలో పూలతో వివోఏల వినూత్న నిరసన

**గన్నేరువరం, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




గన్నేరువరం మండల కేంద్రంలో తెలంగాణ ఐకెపి వివోఏలు చెవిలో పూలతో వినూత్న నిరసన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుండి శాంతియుత సమ్మె కొనసాగుతోందని మండల అధ్యక్షుడు బుర్ర శ్రీధర్ గౌడ్ తెలిపారు.మూడు సంవత్సరాలు గడిచినా వేతనాలు పెంచకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వివోఏకు కనీసం రూ.20 వేల వేతనం, హెచ్ ఆర్ పాలసీ, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వివోఏలు తమ సమస్యల పరిష్కారం కోసం వినూత్న నిరసనతో ప్రభుత్వ దృష్టిని ఆకర్షించారు.

# విదేశాలలో ఉంటే భూములు మాయం

**బిఎస్పి పార్టీ ఆరోపణలు**

**హుస్నాబాద్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హుస్నాబాద్ పట్టణానికి చెందిన పూదరి లక్ష్మీనారాయణ మృతి తర్వాత ఆయన పేరుతో ఉన్న భూములు రికార్డుల మార్పిడి ద్వారా మాయం అయ్యాయని బిఎస్పి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆరోపించారు.మల్లయ్య కుటుంబానికి చెందిన 1175 ఖాతా నంబరులో ఉన్న దాదాపు నాలుగు ఎకరాల భూమిని ఎటువంటి లీగల్ హెయిర్ సర్టిఫికెట్ లేకుండా, ప్రొసీడింగ్ కాపీలు లేకుండా డమ్మీ ఖాతా (3553) ద్వారా మార్పిడి చేసి, తరువాత 1174 ఖాతాలోకి మళ్లించారని ఆయన తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు




చేసినప్పుడు భూములు ఇంకా పూదరి లక్ష్మీనారాయణ పేరుతోనే ఉన్నట్లు వివరాలు ఇచ్చారని, కానీ ప్రస్తుతం 61007 ఖాతా నంబరులో మార్కా సుశీల పేరుతో రికార్డులు ఉన్నాయని, కొంత భూమి అమ్మినట్లు కూడా రికార్డులు చూపుతున్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ భూములకు సంబంధించి పూదరి లక్ష్మీనారాయణ, పూదరి వెంకటరాజం తల్లి పూదరి ఎల్లవ్వ కొంత భూమిని పచ్చిమట్ల అంజలి పేరుతో వీలునామా ద్వారా రాసి ఇచ్చారని తెలిపారు.రావీందర్ గౌడ్ మాట్లాడుతూ, 1174, 1175, 3553, 61007 ఖాతాలలోని భూముల రికార్డులపై సమగ్ర విచారణ జరిపి, అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాలి. బాధితులకు న్యాయం జరగాలి అని డిమాండ్ చేశారు.విదేశాలలో ఉంటే భూములు మాయం అవుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని బిఎస్పి పార్టీ పట్టుదలగా కోరుతోంది.

# ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రజావాణి దరఖాస్తుదారుల వినూత్న నిరసన




**హుస్నాబాద్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గత రెండు సంవత్సరాలుగా ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు సమర్పించినప్పటికీ ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆరోపిస్తూ సోమవారం హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట దరఖాస్తుదారులు వినూత్న నిరసన చేపట్టారు. ఫ్లెక్సీ బ్యానర్లతో ఆందోళన వ్యక్తం చేసిన వారు, ప్రజలను అధికారులు చులకనగా చూస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఇంచార్జ్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ప్రజా సమస్యలు పరిష్కారానికి ఉపయోగపడేలా ఉండాలని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని నిరసనలో పాల్గొన్న వారు డిమాండ్ చేశారు.

**ప్రాణరక్షకులు -- 108 అంబులెన్స్ పైలెట్లు**

మే 26న జరగనున్న జాతీయ 108 అంబులెన్స్ పైలెట్ల దినోత్సవం సందర్భంగా వారి సేవాస్ఫూర్తిని గుర్తుచేసుకోవడం సమాజానికి అవసరం. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మొదట గుర్తుకు వచ్చే సేవల్లో 108 అంబులెన్స్ ప్రధానమైనది. ప్రమాదాలు, గుండెపోటు, గర్భిణీ అత్యవసరాలు, అనారోగ్య సమస్యలు వంటి క్లిష్ట సమయాల్లో 108 సిబ్బంది అండగా నిలుస్తారు. ఇందులో ముఖ్యంగా అంబులెన్స్‌ను నడిపే పైలెట్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం 12 అంబులెన్సులు సేవలందిస్తుండగా, వాటికి గాను 25 మంది పైలెట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. రాత్రింబవళు తేడా లేకుండా ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వారు నిరంతరం అప్రమత్తంగా ఉంటారు. ఒక ఫోన్ కాల్ వచ్చిన వెంటనే ఘటన స్థలానికి చేరుకుని రోగులను సమయానికి ఆసుపత్రికి తరలించడం వారి ప్రధాన బాధ్యత. 108 పైలెట్లు కేవలం డ్రైవర్లు కాదు, ప్రాణాలను గమ్యానికి చేర్చే బాధ్యతగల సేవాధికారులు. ట్రాఫిక్, వర్షం, రాత్రి వేళలు వంటి ఇబ్బందులు ఉన్నా వారు తమ సేవను ఆపరు. ప్రతి నిమిషం విలువైనదని తెలుసుకుని రోగికి చికిత్స అందేలా చేయడంలో వారి పాత్ర అమూల్యం. గర్భిణీ స్త్రీలను సురక్షితంగా ఆసుపత్రికి చేర్చడం, ప్రమాద బాధితులను వెంటనే వైద్యసేవలకు అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సహాయం అందించడం వంటి ఎన్నో సేవలను వారు నిబద్ధతతో నిర్వహిస్తున్నారు. వారి అనుభవాలు కూడా ఈ సేవాస్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి. ప్రతి కాల్ వెనుక ఒక కుటుంబం ఆశ ఉంటుంది. ఆ ఆశను నిలబెట్టడమే 108 పైలెట్‌గా నాకు గర్వకారణం అని సీనియర్ పైలెట్ శ్రీనివాస్ పెద్ది అన్నారు. సైరన్ మోగిన ప్రతిసారీ మాలో సేవాభావం మరింత పెరుగుతుంది అని మామిడాల ఆంజనేయులు తెలిపారు. ఒక రోగి సురక్షితంగా ఆసుపత్రికి చేరితే అదే మా నిజమైన సంతోషం అని బరిగె లక్ష్మణ్ పేర్కొన్నారు. మేము కేవలం అంబులెన్స్ నడిపేవాళ్లు కాదు, ప్రాణాలను గమ్యానికి చేర్చే బాధ్యత తీసుకున్న సేవకులం అని బెస్త రాజశేఖర్ అన్నారు. ప్రజల ఆశీర్వాదాలే మాకు అతిపెద్ద పురస్కారం అని ప్రవీణ్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ భూమా నాగేందర్ మాట్లాడుతూ, జాతీయ 108 పైలెట్ల దినోత్సవం సందర్భంగా అన్ని పైలెట్లకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. వారు ఎన్నో కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తున్నారు అని అన్నారు. జిల్లా మేనేజర్ సవనపెల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి పైలెట్ సేవాస్ఫూర్తితో విధులు నిర్వర్తిస్తూ సమాజానికి గొప్ప సేవ అందిస్తున్నారు అని పేర్కొన్నారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో తొలి భరోసాగా నిలిచే 108 పైలెట్ల సేవలు నిజంగా అభినందనీయం. మానవత్వం, సేవాభావం, సమయపాలన వారి వృత్తికి ప్రధాన బలాలు. చాలాసార్లు వారు ప్రమాదకర పరిస్థితుల్లో కూడా ధైర్యంగా పనిచేస్తూ ప్రజలకు ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. జాతీయ 108 పైలెట్ల దినోత్సవం సందర్భంగా సమాజం మొత్తం వారి సేవాస్ఫూర్తికి కృతజ్ఞతలు తెలుపుతూ, నిజమైన ప్రాణరక్షకులుగా వారిని గౌరవించాలి.

# ప్రాణరక్షకులు
# 108 అంబులెన్స్ పైలెట్లు



మే 26న జరగనున్న జాతీయ 108 అంబులెన్స్ పైలెట్ల దినోత్సవం సందర్భంగా వారి సేవాస్ఫూర్తిని గుర్తుచేసుకోవడం సమాజానికి అవసరం. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మొదట గుర్తుకు వచ్చే సేవల్లో 108 అంబులెన్స్ ప్రధానమైనది. ప్రమాదాలు, గుండెపోటు, గర్భిణీ అత్యవసరాలు, అనారోగ్య సమస్యలు వంటి క్లిష్ట సమయాల్లో 108 సిబ్బంది అండగా నిలుస్తారు. ఇందులో ముఖ్యంగా అంబులెన్స్‌ను నడిపే పైలెట్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం 12 అంబులెన్సులు సేవలందిస్తుండగా, వాటికి గాను 25 మంది పైలెట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వారు నిరంతరం అప్రమత్తంగా ఉంటారు. ఒక ఫోన్ కాల్ వచ్చిన వెంటనే ఘటన స్థలానికి చేరుకుని రోగులను సమయానికి ఆసుపత్రికి తరలించడం వారి ప్రధాన బాధ్యత. 108 పైలెట్లు కేవలం డ్రైవర్లు కాదు, ప్రాణాలను గమ్యానికి చేర్చే బాధ్యతగల సేవాధికారులు. ట్రాఫిక్, వర్షం, రాత్రి వేళలు వంటి ఇబ్బందులు ఉన్నా వారు తమ సేవను ఆపరు. ప్రతి నిమిషం విలువైనదని తెలుసుకుని రోగికి చికిత్స అందేలా చేయడంలో వారి పాత్ర అమూల్యం. గర్భిణీ స్త్రీలను సురక్షితంగా ఆసుపత్రికి చేర్చడం, ప్రమాద బాధితులను వెంటనే వైద్యసేవలకు అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సహాయం అందించడం వంటి ఎన్నో సేవలను వారు నిబద్ధతతో నిర్వహిస్తున్నారు. వారి అనుభవాలు కూడా ఈ సేవాస్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి. ప్రతి కాల్ వెనుక ఒక కుటుంబం ఆశ ఉంటుంది. ఆ ఆశను నిలబెట్టడమే 108 పైలెట్‌గా నాకు గర్వకారణం అని సీనియర్ పైలెట్ శ్రీనివాస్ పెద్ది అన్నారు. సైరన్ మోగిన ప్రతిసారీ మాలో సేవాభావం మరింత పెరుగుతుంది అని మామిడాల ఆంజనేయులు తెలిపారు. ఒక రోగి సురక్షితంగా ఆసుపత్రికి చేరితే అదే మా నిజమైన సంతోషం అని బరిగె లక్ష్మణ్ పేర్కొన్నారు. మేము కేవలం అంబులెన్స్ నడిపేవాళ్లు కాదు, ప్రాణాలను గమ్యానికి చేర్చే బాధ్యత తీసుకున్న సేవకులం అని బెస్త రాజశేఖర్ అన్నారు. ప్రజల ఆశీర్వాదాలే మాకు అతిపెద్ద పురస్కారం అని ప్రవీణ్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ భూమా నాగేందర్ మాట్లాడుతూ, జాతీయ 108 పైలెట్ల దినోత్సవం సందర్భంగా అన్ని పైలెట్లకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. వారు ఎన్నో కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తున్నారు అని అన్నారు. జిల్లా మేనేజర్ సవనపెల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి పైలెట్ సేవాస్ఫూర్తితో విధులు నిర్వర్తిస్తూ సమాజానికి గొప్ప సేవ అందిస్తున్నారు అని పేర్కొన్నారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో తొలి భరోసాగా నిలిచే 108 పైలెట్ల సేవలు నిజంగా అభినందనీయం. మానవత్వం, సేవాభావం, సమయపాలన వారి వృత్తికి ప్రధాన బలాలు. చాలాసార్లు వారు ప్రమాదకర పరిస్థితుల్లో కూడా ధైర్యంగా పనిచేస్తూ ప్రజలకు ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. జాతీయ 108 పైలెట్ల దినోత్సవం సందర్భంగా సమాజం మొత్తం వారి సేవాస్ఫూర్తికి కృతజ్ఞతలు తెలుపుతూ, నిజమైన ప్రాణరక్షకులుగా వారిని గౌరవించాలి.

## అక్రమ గోరవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

-బక్రీద్ నేపథ్యంలో అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్ ఏర్పాటు



**నందికొట్కూరు, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్, నందికొట్కూరు రూరల్ సీఐ టి. సుబ్రహ్మణ్యం సూచనలతో బ్రాహ్మణకోట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొల్లబాపురం గ్రామం వద్ద అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై వి. మణికంఠ తెలిపారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ, ఎస్సై మాట్లాడుతూ, “పండుగ సీజన్‌లో కొందరు వ్యక్తులు చట్టవ్యతిరేకంగా గోవులను తరలించే అవకాశం ఉన్నందున ఈ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. గోరవాణా చట్టరీత్యా నేరం. ఎవరైనా అక్రమంగా గోవులను తరలిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘించిన వారికి శిక్షలు తప్పవు” అని హెచ్చరించారు. కొల్లబాపురం చెక్‌పోస్ట్ ద్వారా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

## శివపల్లిలో ప్రభుత్వ విప్‌కు ఘన సన్మానం

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం



**ఎలిగేడు, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును సోమవారం ఎలిగేడు మండలం శివపల్లిలో ఆయన నివాసంలో ఎలిగేడు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, సంఘ నాయకులు మాట్లాడుతూ, “రోడ్డు కమాన్ నుండి గుడి వరకు సీసీ రోడ్డు నిర్మాణం, ప్రహరిగోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశాం. దీనికి ఎమ్మెల్యే విజయరమణారావు గారు సానుకూలంగా స్పందించారు” అని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోడూరి సత్యనారాయణ, భక్త శివ హనుమాన్ మార్కండేయ దేవాలయ అధ్యక్షుడు వెంగలదాసు బాస్కర్, మాజీ ఎంపీటీసీ బూర్ల సత్యనారాయణ, నాయకులు బూర్ల వెంకటసత్యం, రాజేశం, నాగరాజు, శ్రీనివాస్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలు



**కరీంనగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో ఈ రోజు కళాభారతి వేదికగా మహిళా వారోత్సవాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం న్యూట్రిషన్ మిషన్ థీమ్‌తో సాగింది. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ అంగన్వాడీ, మెప్మా, మున్సిపల్ శాఖలు చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో లబ్ధి చేకూరుస్తున్నాయని వివరించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణానికి ఇది పునాది అవుతుందని అన్నారు. కళాభారతి ప్రాంగణంలో హెల్త్ డిపార్ట్మెంట్ ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏ పథకం అయినా క్షేత్ర స్థాయి వరకు ప్రజలకు చేరాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమం చివర్లో ఆర్పీలకు జంబో చెక్ చీరలు పంపిణీ చేయగా, అంగన్వాడీ టీచర్లకు వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జంక్ ఫుడ్ తినకూడదని, నూనె, చక్కెర వాడకాన్ని తగ్గించాలని, పోషకాహారం ప్రాధాన్యతను వివరించి ప్రతిజ్ఞ చేయించారు. కళాభారతి లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మేయర్, మున్సిపల్ కమిషనర్, ప్రజా ప్రతినిధులు సందర్శించారు. 181, 1098 టోల్ ఫ్రీ నంబర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్, పలువురు కార్పొరేటర్లు, డి డబ్ల్యు ఓ సరస్వతి, సీడీపీఓ సబిత, డిప్యూటీ కమిషనర్ వేణు మాధవ్, డి ఎం సిశ్రీవాణి, టీఎంసీ మానస, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

-- కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 353 మంది అర్జీదారులు దరఖాస్తులు సమర్పించగా, కొన్ని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

## రాములపల్లి -- బొమ్మనపల్లి మధ్య ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



**హుస్నాబాద్ , మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిగురుమామిడి మండలంలోని రాములపల్లి -- బొమ్మనపల్లి గ్రామాల మధ్య ఉన్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్లు దొంగలు అపహరించిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. రోజురోజుకు ఇలాంటి దొంగతనాలు పెరుగుతుండటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా దెబ్బతినడంతో పంటలకు నష్టం కలుగుతోందని వారు తెలిపారు. వెంటనే పోలీసు శాఖ, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ సందర్భంగా రైతులు కత్తుల చంద్రయ్య, మామిడి రాజు, మేడుదుల ఐలయ్య, కత్తుల మంజుల, కత్తుల రమేష్‌తో పాటు స్థానిక రైతులు తమ ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి కీలకమైన విద్యుత్ సరఫరా దెబ్బతినకుండా ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలను అరికట్టాలని రైతులు పట్టుదలగా డిమాండ్ చేస్తున్నారు.

## చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



**నల్లగొండ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చేనేత, పవర్లూమ్ కార్మికులకు జియో ట్యాగ్ ఆధారంగా గుర్తింపు కార్డులు జారీ చేసి, అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన నేతలు, “గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల అనేకమంది కార్మికులు పెన్షన్లకు దూరమవుతున్నారు” అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారం- పోషణపై అవగాహన

**గర్భిణీలకు ఐసీడీఎస్ ప్రత్యేక కార్యక్రమం**



**దేవరకొండ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లా డిండి గ్రామపంచాయతీలో ఐసీడీఎస్ అధికారులు ఆదివారం గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం, పోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, "రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు, ధాన్యాలు, చిరుధాన్యాలు తప్పనిసరిగా చేర్చాలి. జంక్ ఫుడ్, అధిక చక్కెర, ఉప్పు, నూనె, ప్రాసెస్ చేసిన ఆహారాల వినియోగాన్ని తగ్గించాలి. గర్భిణీలు, బాలింతలు, పిల్లల సరైన పోషణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం" అని సూచించారు. తగినంత నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ఆరోగ్యకరమైన పానీయాలను వినియోగించాలని ప్రోత్సహించారు. అధిక బరువు, ఊబకాయం నివారణకు ప్రతిరోజూ యోగా, నడక, వ్యాయామం, శారీరక శ్రమ అవసరమని, పెద్దలు రోజుకు కనీసం 30--60 నిమిషాలు, పిల్లలు కనీసం 60 నిమిషాలు వ్యాయామం చేయాలని సూచించారు. మొబైల్, టీవీ వినియోగాన్ని తగ్గించి, రోజుకు 7--8 గంటల నిద్ర తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సత్యకుమారి, చంద్రకళ, ఆయా పార్వతి, నాగమణి, ఆశా వర్కర్, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన రూ.4.50 కోట్ల అవినీతిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌బి డిమాండ్




**కరీంనగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా జనరల్ హాస్పిటల్‌లో జరిగిన రూ4.50 కోట్ల అవినీతి పై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఏఐఎఫ్‌బి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు సమర్పించిన ఏఐఎఫ్‌బి నాయకులు, 2023లో అప్పటి డీఎంహెచ్వో లలితదేవి ఇచ్చిన ఎంక్వైరీ రిపోర్టు ఆధారంగా సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్, డాక్టర్ నవీనతో పాటు ఇతర వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిపోర్టులో హెచ్‌డీఎస్ నిధులు, కాయకల్ప నిధులు, టీవీవీపీ, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ, వాహనాల డీజిల్, పెట్రోల్ ఖర్చులు వంటి అంశాల్లో దాదాపు రూ4.50 కోట్ల రూపాయలు ఎటువంటి బిల్లులు, రసీదులు, ఓచర్లు లేకుండా వినియోగించారని స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని వారు విమర్శించారు. జనరల్ హాస్పిటల్ ఐసీఐసీఐ, ఐవోబీ, యూనియన్ బ్యాంకుల ఖాతాలను 2021 నుండి 2024 వరకు సమగ్రంగా ఆడిట్ చేయాలని, అవినీతికి పాల్పడిన అధికారులపై శాఖాపరమైన మరియు క్రిమినల్ చర్యలు ప్రారంభించాలని ఏఐఎఫ్‌బి నాయకులు కోరారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, తక్షణమే చర్యలు తీసుకుంటామని, కమీషనర్‌కు లేఖ రాస్తామని తెలిపారు. ఏఐఎఫ్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం చేసిన అధికారులందరినీ సస్పెండ్ చేసి, అక్రమంగా కాజేసిన సొమ్మును రికవరీ చేయాలి. నిష్పక్షపాత, పారదర్శక విచారణ జరగాలి అని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన అవినీతి పై తక్షణ చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌బి పట్టుదలగా కోరుతోంది.

## మిర్యాలగూడలో ఇందిరమ్మ చీరల పంపిణీ



**మిర్యాలగూడ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిర్యాలగూడ పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ, "మహిళల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం. పేద కుటుంబాల ఆడబిడ్డల ముఖాల్లో చిరునవ్వులు చూడాలనే సంకల్పంతో ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభించాం. సన్నబియ్యం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో పాటు సహకార సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలను 5 లక్షల నుంచి 10 లక్షల వరకు పెంచాం" అని తెలిపారు. రానున్న రోజుల్లో మహిళల అభివృద్ధి కోసం మరిన్ని సంక్షేమ పథకాలను తీసుకురానున్నామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

**-విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా సమ్మర్ క్యాంపులు**




**దేవరకొండ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం, విలక్షణమైన ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించడం కోసం వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని దేవరకొండ మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు అన్నారు. దేవరకొండ పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 11వ తేదీ ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం సోమవారం విజయవంతంగా ముగిసింది. పాఠశాల ఆవరణలో జరిగిన ముగింపు కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు చేరుపెల్లి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ వేడుకలకు మండల విద్యాధికారి మాతృ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరం ద్వారా విద్యార్థులు కేవలం ఆటలకే పరిమితం కాకుండా స్పోకెన్ ఇంగ్లీష్, యోగా, డ్రాయింగ్, మ్యూజిక్, డాన్స్ వంటి విభిన్న రంగాలలో ప్రత్యేక శిక్షణ పొందడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ శిక్షణ వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి ఒక చక్కని వేదికగా నిలిచిందని అన్నారు. ఇలాంటి శిబిరాలు విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడంతో పాటు, నిత్య జీవితంలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని జయించేందుకు తోడ్పడతాయని చైర్‌పర్సన్ శైలజ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులు ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం ఈ శిక్షణ కాలంలో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ షబానా బేగం, తాటికోల్ హెచ్ఎం కే. బక్కయ్య, సీనియర్ ఉపాధ్యాయులు ఏజే విజయ్ కుమార్, నక్క కొండయ్య, కే. ప్రవీణ్, డాన్స్ మాస్టర్ లావణ్య, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిరుపేదలకు కొండంత అండ

**-- సీఎం రిలీఫ్ ఫండ్**

**-మర్రిగూడలో 60 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**



**మర్రిగూడ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. వివిధ గ్రామాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 24,59,000 విలువైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్ మాట్లాడుతూ, "నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆసరాగా నిలుస్తోంది" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాసు, మాజీ జెడ్పిటిసి మేతరి యాదయ్య, వెన్నమనేని రవీందర్ రావు, వట్టిపల్లి సర్పంచ్ సిరిసవాడ బిక్షం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘంలో కొత్త నియామకాలు

**రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కేతిరి ఉప్పలయ్య**



**కేసముద్రం, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన కేతిరి ఉప్పలయ్య, అదేవిధంగా బేరువాడ గ్రామానికి చెందిన పేరం బక్కయ్యను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కూతాటి కుమార్ ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య, బక్కయ్యలు మాట్లాడుతూ, "మా పై నమ్మకం ఉంచి ఈ పదవులను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కూతాటి కుమార్, జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి, జిల్లా ఇన్‌చార్జ్ కట్ల పాపయ్య, కార్యదర్శి పళ్లకొండ రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాగ మల్లయ్య, యూత్ అధ్యక్షులు, బామన్లపల్లి సర్పంచ్ కోట ఎల్లేష్, కట్ల పెద్ద రవీందర్‌లకు కృతజ్ఞతలు" తెలిపారు. సంఘంలోని అందరినీ కలుపుకొని ఎటువంటి బేషజాలు లేకుండా సంఘ అభివృద్ధికి అన్నివిధాలుగా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

## మర్రిగూడలో ఈదురుగాలులతో భారీ వర్షం

**తడిసిన వరి ధాన్యం -- రైతుల్లో ఆందోళన**







**మర్రిగూడ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చండూరు మాల్ ప్రధాన రహదారిపై ఇరువైపుల చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అంతేకాకుండా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకెపి సెంటర్లలో వరి ధాన్యం తడిసి ముద్దయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్ల ముందే తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

## గౌరవ డాక్టరేట్ అందుకున్న ఆయిల్ సదానందం గౌడ్ కు సన్మానం



**తలకొండపల్లి, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీచే చెన్నై భారతీయ విద్యా భవన్‌లో మే 17న గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్న రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలానికి చెందిన ఆయిల్ సదానందం గౌడ్ను హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా ఘనంగా సన్మానించింది. చెన్నంపల్లి గ్రామంలోని నిరుపేద రైతు కుటుంబంలో జన్మించిన సదానందం గౌడ్ ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పలు ఫస్ట్ క్లాస్ పట్టాలు పొందారు. గత 26 ఏళ్లుగా విద్యా రంగంలో లెక్చరర్‌గా సేవలందిస్తూ, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవలలో విశేష కృషి చేశారు. ఈ గౌరవ డాక్టరేట్ అవార్డు రావడం బీసీ వర్గానికి చెందిన వ్యక్తికి గర్వకారణమని, ఆయన చేసిన సేవలకు ఇది సరైన గుర్తింపని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ షఫీ బాబా, జిల్లా వెల్ఫేర్ సెక్రటరీ భీమయ్య అభినందనలు తెలిపారు.

## భూముల మార్కెట్ విలువల నవీకరణపై కలెక్టర్ ఆదేశాలు

**నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచన**



**నల్లగొండ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సోమవారం ఉదయాదిత్య భవనంలో సబ్ రిజిస్ట్రార్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలతో భూముల మార్కెట్ విలువలపై సమీక్ష నిర్వహించారు. జీవో నెం.41 ప్రకారం భూముల మార్కెట్ విలువల నవీకరణను ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అర్బన్, రూరల్ కేటగిరీలుగా విభజించి చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు సంబంధించి ఫారమ్-1, 2, 3, 4 ఆధారంగా ప్రాంతాల వారీగా రహదారులు, మండల కేంద్రాలు, నియోజకవర్గ పరిధులు పరిగణనలోకి తీసుకొని విలువలు అంచనా వేయాలని తెలిపారు. అర్బన్ కమిటీలో అదనపు కలెక్టర్ చైర్మన్‌గా, మున్సిపల్ కమిషనర్, జెడ్పీసీఈఓ, సబ్ రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారని; రూరల్ కమిటీలో ఆర్డీవో చైర్మన్‌గా, సబ్ రిజిస్ట్రార్, తహసిల్దార్, ఎంపీడీవో సభ్యులుగా వ్యవహరిస్తారని వివరించారు. అగ్రికల్చర్ భూములకు కనీస మార్కెట్ విలువ రూ. 2.75 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ. 5 లక్షలు, హెచ్ఎండీఏ పరిధిలో రూ. 10 లక్షలు ఉండాలని ప్రభుత్వం నిర్దేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు జే. శ్రీనివాస్, వై. అశోక్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, దేవరకొండ ఆర్డీవో ప్రియదర్శిని, సబ్ రిజిస్ట్రార్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే మా ధ్యేయం
# ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు


శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు


మాట్లాడుతున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయాల నాగేశ్వరరావు


**ఎలిగేడు లాలపల్లిలో 20 వేల మెట్రిక్ టన్నుల గోదాం శంకుస్థాపన**

**ఎలిగేడు, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామంలో సోమవారం రూ.14.38 కోట్ల నిధులతో 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రతినిత్యం రైతు సంక్షేమం కోసమే పాటుపడుతున్నాం. గత ప్రభుత్వంలో గోదాముల నిర్మాణం జరగలేదు. ఇప్పుడు వరి, మొక్కజొన్న అధికంగా పండుతున్న నేపథ్యంలో నిల్వ సమస్యలు లేకుండా కొత్త గోదాములు నిర్మిస్తున్నాం" అని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఈ వేసంగి సీజన్‌లో రెండు లక్షల పైగా మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని, రైతులకు బోనస్ రూపంలో కోట్ల రూపాయలు లభించాయని తెలిపారు. పంట మార్పిడి వల్లే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని, మొక్కజొన్న, పామాయిల్, కూరగాయలు, పప్పుదినుసులు వంటి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. "వచ్చే రెండున్నర సంవత్సరాల్లో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు నిర్మించబోతున్నాం. రైతుల సమస్యలు పరిష్కరించడమే మా లక్ష్యం" అని ఎమ్మెల్యే విజయరమణరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాశ్‌రావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు దుగ్యాల సంతోష్‌రావు, స్థానిక సర్పంచ్ ఏలేటి వెంకట్రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.


గోదాం మ్యాపును ప్రభుత్వ విప్ కు వివరిస్తున్న అధికారులు


పాల్గొన్న నాయకులు కార్యకర్తలు

## పాలన అంటే అధికార గదుల్లో ఆగిపోవడం కాదు, ప్రతి గడపకు చేరడం



**దేవరకొండ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా 136 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ కింద 200 మందికి రూ.80,48,500 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.17 కోట్లు, ఎల్‌ఓసీ కింద రూ.9 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "పాలన అంటే అధికార గదుల్లో ఆగిపోవడం కాదు, ప్రతి గడపకు చేరి ప్రజల సమస్యలు పరిష్కరించడం. పేద కుటుంబాల అమ్మాయిల వివాహాలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయి. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం" అని అన్నారు. అలాగే జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కానుకగా ఇందిరమ్మ జీవిత భీమా పథకం ప్రారంభమవుతుందని, రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల భీమా రక్షణ కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పంటల మార్పిడి తుది నివేదిక
# రూపొందించిన రైతు కమిషన్

**-నిపుణులతో విస్తృత స్థాయి సమావేశం**





**హైదరాబాద్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలో పంటల మార్పిడి విధానం, భవిష్యత్ వ్యవసాయ ప్రణాళికలు, రైతుల ఆదాయాభివృద్ధి అంశాలపై తుది నివేదిక రూపొందించేందుకు రైతు కమిషన్ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నీటి లభ్యత, భూసార పరిస్థితులు, మార్కెట్ డిమాండ్, రైతుల ఆర్థిక స్థితి వంటి అంశాలను సమగ్రంగా చర్చించారు. పంటల మార్పిడి ద్వారా రైతుల ఆదాయం పెంపు, నీటి వినియోగ సామర్థ్యం మెరుగుదల, భూసార పరిరక్షణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ విధానాల రూపకల్పనపై నిపుణులు సూచనలు చేశారు. ఉద్యాన పంటల విస్తరణ, మిల్లెట్లు, పప్పుదినుసుల సాగు ప్రోత్సాహం, మార్కెట్ ఆధారిత పంటలపై రైతులకు అవగాహన కల్పించడం, విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలను ప్రాధాన్యంగా చర్చించారు. గ్రామీణ స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు, సాగు ఖర్చులను తగ్గించే సాంకేతిక పద్ధతులను ప్రోత్సహించాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, కేవీఎన్ రెడ్డి, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, మరికంటి భవానీ రెడ్డి మాట్లాడుతూ, "సమావేశంలో వచ్చిన సూచనలు, సిఫారసులను సమగ్రంగా పరిశీలించి తుది నివేదికను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తాం" అని తెలిపారు. గత పదేళ్లలో ఉద్యాన పంటలు, మిల్లెట్ సాగు తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, రైతులు వరి, పత్తి, మొక్కజొన్నల వైపు మాత్రమే వెళు న్నారని గుర్తుచేశారు. చిరుధాన్యాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, రైతులు ఆవైపు మళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో జి. చిన్నారెడ్డి, అజేయ కల్లం, వి. నాగిరెడ్డి, చింతల వెంకట్ రెడ్డి, నారాయణరావు, పి. రాఘవరెడ్డి, బి. కృపాకర్ రెడ్డి తదితరులు పాల్గొని విలువైన సూచనలు అందించారు.

## ఏబీవీపీ నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్‌గా ముక్తాల శాంతన్



**నాగర్‌కర్నూల్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 22, 23, 24 తేదీల్లో నిర్వహించిన ఏబీవీపీ ప్రాంత అభ్యాస వర్గంలో నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్‌గా ముక్తాల శాంతన్ను రాష్ట్ర అధ్యక్షుడు రావుల కృష్ణ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శాంతన్ మాట్లాడుతూ, "నా మీద నమ్మకం ఉంచి జిల్లా కన్వీనర్ బాధ్యతలు అప్పగించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. విద్యారంగ సమస్యలపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిరంతరం పోరాడుతుంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నా ఏబీవీపీ దృష్టికి తీసుకురావచ్చు" అని తెలిపారు. జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శాంతన్‌కు తోటి స్నేహితులు, ఏబీవీపీ నాయకులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంధన ధరల పెంపుపై కేంద్ర ప్రభుత్వ వైఖరి దుర్మార్గం

**- మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్**




**ఆమనగల్లు, మే 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రోజురోజుకూ విచ్చలవిడిగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలపై మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజల నడుం విరుస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక వైఖరిని సోమవారం ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు అదుపులోనే ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం పన్నుల రూపంలో ప్రజలపై మోయలేని భారం మోపుతోందని మండిపడ్డారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల దేశంలో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమం గురించి మాట్లాడుతున్న బీజేపీ నేతలు ఈ అంశంపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదన్నారు. తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడంలో కూడా కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.

## సూర్య ప్రతాపం


-సూర్యుడా...
తగ్గించుమా నీ ప్రతాపం
భరించలేకున్నాం నీ తాపం
గమనించుమా
మా పరితాపం
-అత్యాశతో
అడవులు నరికి
కల్మషంతో
కాలుష్యం పెంచి
మా హౌజులు బాగుంటే చాలు
అనే డిఫెక్ట్ తలపులతో
గ్రీన్ హౌజ్ ఎఫెక్ట్ కు
కారణం మేమే
-ప్రకృతి వార్నింగ్ ఇచ్చినా
నిరాకరించి
నిర్లక్ష్యం చేసి
గ్లోబల్ వార్మింగ్ కు
కారకులం మేమే
-మా వికృత చేష్టలతో
విషతుల్య భావనలతో
అమూల్యమైన
ప్రకృతి సమతుల్యాన్ని దెబ్బతీసి
తగిన మూల్యం చెల్లిస్తున్నాం
-ఆదిత్యుడా...
మాపై ఆగ్రహించక
మానవ వేదన
మా నివేదన
స్వీకరించి
మము అనుగ్రహించు
-ఎందుకంటే
మాన్యుల మతలబేమో గాని
సామాన్యుల వ్యధలు కని
కనికరించు
జీవజాల ఉనికి
మానవజాతి మనుగడ
ఆ చంద్ర తారర్కం ఉండాలంటే
అవశ్యం అవసరం
ఈ సూర్య కటాక్షం

Ch.శ్రీనివాస్
ఉపాధ్యాయుడు
ZPHS కనుకుల
స్వగ్రామం: ఎలిగేడు



## ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం..

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, మే 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పేదలకు వైద్య సహాయం అందించడంలో ఎలాంటి లోటులేకుండా.. ప్రతిఒక్కరికీ అండగా నిలబడటమే మా లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. హైద్రాబాద్ లోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి సీఎంరిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన లబ్ధిదారులు తమ వైద్యానికి సంబంధించి అన్ని డాక్యుమెంట్లు (బిల్లులు, మెడికల్ రిపోర్టులు) మా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. పత్రాలను పరిశీలించి ప్రభుత్వానికి పంపించి ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాడుగుల మండలం అధ్యక్షుడు భట్టు కిషన్ రెడ్డి, ఉపసర్పంచ్లు విజయ్ రాథోడ్, దళపతి, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్ రెడ్డి, జగన్ గౌడ్, సందీప్, యాదగిరి రెడ్డి, భాస్కర్, అశోక్, వెంకట్ రెడ్డి, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## చివరి గింజవరకూ కొనుగోలు చేస్తాం

**- వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి**

**- వడ్ల కొనుగోలు 85% పూర్తి**



**ఆమనగల్లు, మే 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల రైతుల నుండి వడ్లను 85% కొనుగోలు చేసినట్లు మరో వారం రోజుల్లో 100% పూర్తి చేస్తామని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ తెలిపారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో డైరెక్టర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గూడూరు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. 691 రైతుల నుండి 35,965 క్వింటాళ్ల వడ్లను, 550 రైతుల నుండి 35,140 క్వింటాళ్ల మక్కలను, రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు పొద్దు తిరుగుడు సైతం కొనుగోలు చేస్తున్నట్లు అన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు, అతిత్వరలో విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రైతులు వడ్లను ఆరబెట్టుకొనుటకు రూ. 14లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తామని అన్నారు. రైతుల నుంచి చివరిగింజ వరకూ కొనుగోలు చేస్తామని రైతులు అధైర్యపడొద్దని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు తాళ్ల రవీందర్, వెంకట్ రెడ్డి, సంపత్ కుమార్, నరేష్ నాయక్, జెల్ల రమేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన శ్రీనివాస్ గౌడ్



**ఆమనగల్లు, మే 25 నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ బాలాజీ సింగ్ లతో కలిసి సోమవారం టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. గత 32 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి తాను చేస్తున్న నిరంతర సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్బంగా పేద ప్రజల అభివృద్ధికి సంక్షేమానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు అటు కార్యకర్తలను ఆయా సంఘాలను సభ్యులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి సూచిస్తూ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వివరించిన విన్నపంపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని త్వరలోనే సముచిత స్థానం కల్పిస్తారని టీపీసీసీ సభ్యులు అయిల్లా శ్రీనివాస్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# వెల్దండలో ఈదురుగాలుల బీభత్సం











**-చెట్లు విరిగి పడిపోవడంతో విద్యుత్ అంతరాయం**

**వెల్దండ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం వర్షం కారణంగా ఈదురుగాలులు విరుచుకుపడ్డాయి. గాలుల తీవ్రతకు ఎక్కడికక్కడ చెట్లు విరిగి పడిపోవడంతో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది.ఆర్టీసీ బస్టాండ్, బీసీ హాస్టల్ పరిసరాల్లో చెట్లు రహదారిపై పడిపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. సాయంత్రం ఐదు గంటల సమయంలో వర్షం, గాలుల బీభత్సం కారణంగా పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి.నారాయణపూర్






తండాలో పిడుగు పడి ఒక ఆవు మృతి చెందింది. హైదరాబాద్--శ్రీశైలం జాతీయ రహదారిపై చెట్లు కూలిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.విషయం తెలుసుకున్న సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, గ్రామ వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది చేరుకుని విరిగిన చెట్లు, కరెంటు స్తంభాలను తొలగించి రాకపోకలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకున్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం

**- రజిని సాయిచంద్**
**నియోజకవర్గం సభ్యత్వల ఇంచార్జి**



**ఆమనగల్లు, మే 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కల్వకుర్తి నియోజకవర్గ ఇన్చార్జీ రజినీ సాయిచంద్ పిలుపునిచ్చారు. సోమవారం ఆమనగల్లు మండల పరిధిలోని రాంనుంతల సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ అస్థిత్వానికి రక్షణ కవచంగా నిలిచేందుకు కార్యకర్తల సమూహంగా సభ్యత్వ నమోదు జరగాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు అధ్వాన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలనే నినాదంతో ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. సభ్యత్వ నమోదుతో పార్టీ సంస్థాగత నిర్మాణం పటిష్టం చేయాలన్నారు. పార్టీపై విధేయతతో ఉండే నాయకులు, కార్యకర్తలను గుర్తించి.. వారికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సభ్యత్వ నమోదు డిజిటల్ పద్ధతిన సాగుతుందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 25 నుంచి వచ్చే నెల 25 వరకు 'సర్' కార్యక్రమం నిర్వహిస్తుందని, బూత్ కమీటీ సభ్యులు అప్రమత్తంగా ఉండి, బీఆర్ఎస్ సానుభూతిపరుల ఓట్లను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, సింగిల్ విండో చైర్మన్లు గంప వెంకటేష్, జూపల్లి భాస్కర్ రావు, మాజీ జడ్పీటీసీలు విజిత రెడ్డి, దశరథ్ నాయక్, రవితేజ, మండల అధ్యక్షులు కంబాల పరమేష్, జైపాల్ రెడ్డి, పుట్టరాంరెడ్డి, విజయ్ గౌడ్, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాసయాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, దుడ్డు ఆంజనేయులు యాదవ్, ఎనమల్ల రమేష్, నాగిళ్ల జగన్, సర్పంచులు వ్యక్తావత్ శ్రీనునాయక్, శ్రీను, శంకర్ నాయక్, సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, ఎంగలి రఘు, సురమల్ల సుభాష్, అనంతుల సైదులు గౌడ్, దోనాదుల కుమార్, గండికోట శంకర్, కోట శ్రీను, కొమ్ముప్రసాద్, పరమేష్, గోవింద్ శ్రీధర్, సురిగిమల్ల శేఖర్, రమేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

## సీఎంను కలిసిన ఠాకూర్ బాలాజీ సింగ్



**హైదరాబాద్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత రెండున్నర సంవత్సరాలుగా తనకు తగిన ప్రోటోకాల్ కల్పించకపోవడం, పార్టీ కోసం నిర్విరామంగా చేసిన సేవలు, ఎన్నికల్లో నిర్వహించిన బాధ్యతలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలతో పాటు కల్వకుర్తి మున్సిపాలిటీ ఎన్నికల్లో పూర్తి బాధ్యత తీసుకుని విజయానికి కృషి చేసిన విషయాన్ని ఆయన వివరించారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న తనకు తగిన గుర్తింపు, న్యాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.వినతిని శ్రద్ధగా ఆలకించిన ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు బాలాజీ సింగ్ తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తల సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తిస్తుందని, తగిన సమయంలో సముచిత న్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు.ముఖ్యమంత్రితో జరిగిన ఈ భేటీ అనంతరం తమ సమస్యల పరిష్కారంపై ఆశావహంగా ఉన్నట్లు బాలాజీ సింగ్ వెల్లడించారు. పార్టీ బలోపేతం, ప్రజాసేవ లక్ష్యంగా మరింత చురుకుగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డీసీపీ



**ఆమనగల్లు, మే 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు పట్టణ కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా డీసీపీ నారాయణరెడ్డి, మహేశ్వరం ఏసీపీ జానకీ రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతున్న తీరును వారు స్వయంగా పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం కొనుగోలు ప్రక్రియ, భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. రైతులు, వ్యాపారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మార్కెట్ పరిసరాల్లో శాంతిభద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సీతారాం రెడ్డి, డైరెక్టర్లు తాళ్ల రవీందర్, వెంకట్ రెడ్డి, సంపత్ కుమార్, నరేష్ నాయక్, జెల్ల రమేష్ గౌడ్ మరియు ఏఈఓ బాలకృష్ణ, నిఖిత, సింగల్ విండో అధికారి దేవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నందికొట్కూరులో సి.పి.ఐ (ఎం.ఎల్) లిబరేషన్ పార్టీ ఆందోళన

-లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్



**నందికొట్కూరు, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గృహ లబ్ధిదారులకు తహసీల్దార్ పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని సి.పి.ఐ (ఎం.ఎల్) లిబరేషన్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం గృహ లబ్ధిదారులు ఆందోళన నిర్వహించారు.జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు మాట్లాడుతూ, “మంజూరైన గృహాలకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని పలుమార్లు పీ.జీ.ఆర్.ఎస్‌లో అర్జీలు సమర్పించినప్పటికీ అధికారులు స్పందించడం లేదు. సర్టిఫికెట్లు లేక ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించలేక ఇబ్బందులు పడుతున్నాం” అని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, “ప్రభుత్వం పేదల కోసం గృహాలు మంజూరు చేస్తోంది. అయితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దాదాపు 400 మందికి గృహాలు మంజూరైనా, 300 మందికి పైగా ఇంకా సర్టిఫికెట్లు లేక ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు” అని ఆరోపించారు.నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో పేదలు పాత గుడిసెలు కూల్చుకొని అద్దె ఇళ్లలో, గుడారాల్లో జీవిస్తున్నారని, 15 సంవత్సరాలుగా అగ్రిమెంట్ల ద్వారా కొనుగోలు చేసిన స్థలాల్లో నివసిస్తున్న వారిని ఎంక్వయిరీ చేసి ఆర్డీవో ద్వారా పత్రాలు ఇవ్వాల్సి ఉందని, కానీ తహసీల్దార్ నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు.జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకపోతే లబ్ధిదారులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కాటేపోగు స్వామన్న, టౌన్ కార్యదర్శి బి. రామకృష్ణ, జిల్లా నాయకులు వేల్పుల ఏసన్న, టీ. నరసింహులు, నరేష్, వేల్పుల అశోక్, మహిళా నాయకురాలు షేక్ నవ్య, స్వామి ఎం. శిరీష, లబ్ధిదారులు షికారి మధు, షికారి తార, లింగాల లక్ష్మీదేవి, ఎల్. రజియా తదితరులు పాల్గొన్నారు.

# మడేలేశ్వర స్వామి ఆలయంలో బోర్వెల్ నిర్మాణం

-ప్రభుత్వ విప్ సహకారంతో పనులు ప్రారంభం



**ఎలిగేడు, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలోని మడేలేశ్వర స్వామి ఆలయం ఆవరణలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సహకారంతో బోర్వెల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆలయానికి నీటి సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంపై గ్రామస్థులు, భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్, వార్డు సభ్యులు కవిత--రాకేష్, మాజీ ఉప సర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వరరావు, నాయకులు బూర్ల వెంకటసత్యం, రజక సంఘం నాయకులు ముంజంపల్లి సాయిలు, రాజేశం, లచ్చయ్య, కొమురయ్య, సాయిలు, సమ్మయ్య, రవీందర్, మల్లేశం, మహిపాల్, ఓదెలు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పోతేపల్లి రైతులకు సాగునీరు అందించాలని సర్పంచ్ విజ్ఞప్తి




**వెల్దండ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండలంలోని పోతేపల్లి గ్రామ రైతులందరికీ కేఎల్ఐ డి-82 ప్రధాన కాలువ మరియు పిల్లకాలువల ద్వారా సాగునీరు అందించాలని గ్రామ సర్పంచ్ తగుళ్ల కొండల యాదవ్ ఆధ్వర్యంలో రైతులు ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.సోమవారం కల్వకుర్తి ఇరిగేషన్ కార్యాలయంలో ఎండి వెంకట్ వెంకట్రావు, డీ.ఈ సమ్మయ్య, ఏ.ఈ శ్రీకాంత్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, “మన ప్రాంతంలో ప్రధాన కాలువ ఉన్నప్పటికీ పిల్లకాలువలు లేకపోవడం వల్ల చివరి ఆయకట్టుకు నీరు చేరడం లేదు. దీంతో పంటలకు సకాలంలో నీరు అందక రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు” అని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు సానుకూలంగా స్పందించి, “తదుపరి పంట వరకు సాగునీరు అందిస్తాం” అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న, వడ్లను కొనుగోలు చేయాలంటూ రైతుల నిరసన



**నిర్మల్ , మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: నిర్మల్ జిల్లా కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ చౌరస్తా వద్ద రైతులు సోమవారం మంచిర్యాల ప్రధాన రహదారిపై రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. లింగాపూర్, సారంగాపూర్, మాసాయిపేట్ గ్రామాలకు చెందిన రైతులు ఎర్రటి ఎండలో టేకు ఆకులు నెత్తిపై పెట్టుకొని రోడ్డు పై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.గత నెల రోజులుగా మక్కలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు, తరలింపులో అధికారులు జాప్యం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కళ్ళు మొక్కుతా సార్, మా ధాన్యాన్ని కొనుగోలు చేయండి అంటూ ఒక రైతు రెవిన్యూ అధికారిని వేడుకున్న ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది.ధర్నా సమయంలో ఎండ తీవ్రత తట్టుకోలేక లింగాపూర్ రైతు ఆకుల నర్సయ్య స్పృహ కోల్పోయాడు. సహచర రైతులు వెంటనే ప్రైవేట్ వాహనంలో ఆయనను కడెం ఆసుపత్రికి తరలించారు.రైతులు రాష్ట్ర ప్రభుత్వం రైతులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, కలెక్టర్ వెంటనే వచ్చి ధాన్యం తరలింపు పై పక్క హామీ ఇవ్వాలని, కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.రైతుల ఆవేదనతో కూడిన ఈ నిరసన నిర్మల్ జిల్లాలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

# ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలని కాంగ్రెస్ కౌన్సిలర్ల ఆగ్రహం



**ఖానాపూర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీలో సోమవారం జరిగిన సాధారణ సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు బహిష్కరించారు.మున్సిపల్ చైర్మన్ అవగాహన లేకుండా ఏకపక్ష నిర్ణయాలతో సమావేశం నిర్వహించడం సరికాదని మాజీ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ రాజర సత్యం, కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎజెండా అంశాలు లేకుండా సమావేశం నిర్వహించడం పై వారు తీవ్ర అభ్యంతరం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ లేకుండా సమావేశం నిర్వహిస్తే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు.మున్సిపల్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సహకారంతో అన్ని విధాలుగా సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని, కానీ ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా కార్యకలాపాల్లో జాప్యం చేస్తే సహించేది లేదని వారు స్పష్టం చేశారు. అవగాహన లేకపోతే అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాజుర సత్యం, నిమ్మల రమేష్, గౌర్రె తిరుమల గంగాధర్, సాజిదా బేగం, జమాల్ ఖురేషీ పాల్గొన్నారు.మున్సిపల్ కార్యకలాపాల్లో పారదర్శకత, సమన్వయం అవసరమని కాంగ్రెస్ కౌన్సిలర్లు స్పష్టం చేశారు.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత




**కరీంనగర్ , మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బొమ్మకల్ వద్ద తన ఓపో సెల్ ఫోన్ పోగొట్టుకున్న భావండ్ల మౌనిక హుజురాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సి.ఈ.ఐ.ఆర్ టెక్నాలజీ సహాయంతో ఫోన్‌ను ట్రేస్ చేసి వరంగల్‌లో పట్టుకున్నారు. అనంతరం ఫోన్ యజమాని భావండ్ల మౌనికకు ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి సెల్ ఫోన్‌ను అందజేశారు.ఫోన్ ట్రేస్ చేయడంలో కృషి చేసిన టెక్ టీం సభ్యులు కానిస్టేబుల్ చిట్యాల రాంసాయి, బానోత్ రేనాలను సి. నిరంజన్ రెడ్డి అభినందించారు. పోలీసుల సాంకేతిక వినియోగం ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచుతోంది.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు



**కరీంనగర్ , మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు చేగుర్తి గ్రామానికి చెందిన ఎల్లపెల్లి సందీప్ తన ట్రాక్టర్‌లో మానేరు వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా గోపాల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకున్నారు. పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల కోసం కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పలుమార్లు పట్టుబడితే సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ముమ్మర చర్యలు కొనసాగిస్తున్నారని అధికారులు తెలిపారు.

# హోంగార్డు నాముండ్ల సుందరయ్య 30 ఏళ్ల సుదీర్ఘ సేవలకు ఘన వీడ్కోలు



**కరీంనగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పోలీసు శాఖలో హోంగార్డుగా చేరి మూడు దశాబ్దాల పాటు నిస్వార్థంగా సేవలందించిన నాముండ్ల సుందరయ్య (హెచ్‌జి.92) పదవీ విరమణ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం ఘనంగా వీడ్కోలు సభ జరిగింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై సుందరయ్యను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1996 మార్చి 16న విధుల్లో చేరిన సుందరయ్య నైట్ డ్యూటీ, కోర్టు వాచ్ విధుల్లో క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. పోలీసు శాఖలో హోంగార్డుల పాత్ర కీలకమని, క్షేత్రస్థాయిలో వారు అందించే సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడవాలని ఆకాంక్షించారు.అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది సమక్షంలో సుందరయ్యకు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. తన సర్వీసు కాలంలో తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉంటూ విధుల్లో క్రమశిక్షణ పాటించిన ఆయనను పలువురు అధికారులు అభినందించారు.ఈ వీడ్కోలు కార్యక్రమంలో ఏసీపీ ప్రతాప్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవి, కమిషనరేట్‌కు చెందిన ఇతర పోలీస్ అధికారులు, హోంగార్డులు పాల్గొన్నారు. సుందరయ్య సేవలు పోలీస్ శాఖకు ఆదర్శప్రాయమని అధికారులు అభిప్రాయపడ్డారు.

# న్యూస్ ఛానల్స్‌పై బండి సంజయ్ లీగల్ యాక్షన్

**కరీంనగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తనపై పదేపదే అవాస్తవాలు ప్రచారం చేస్తూ వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న పలు మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానల్స్, సోషల్ మీడియా హ్యాండిల్స్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.నిరాధారమైన వార్తలతో తప్పుడు ప్రచారాలు చేస్తున్న సదరు ఛానల్స్‌పై ఆయన పరువు నష్టం దావా వేస్తూ లీగల్ నోటీసులు జారీ చేశారు. ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీల ఆటను అరికట్టేందుకే ఈ చట్టపరమైన చర్యలు ప్రారంభమయ్యాయని, అబద్ధాలు ప్రచారం చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన వర్గాలు స్పష్టం చేశాయి.తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు బండి సంజయ్ లీగల్ యాక్షన్ ప్రారంభించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## కాలిపోయిన ఈత చెట్ల వనాలకు నష్టపరిహారం ఇవ్వాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్



**జగిత్యాల , మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇటీవల అగ్ని ప్రమాదాల కారణంగా భారీ సంఖ్యలో ఈత చెట్లు కాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేశారు.జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినట్లు వెల్లడించిన ఆయన, ఈత చెట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గీత కార్మికులు, రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సంవత్సరాల పాటు పెంచుకున్న ఈత చెట్లు కాలిపోవడం వల్ల కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.నష్టం జరిగిన ప్రాంతాల్లో అధికారులు వెంటనే సర్వే నిర్వహించి బాధితులకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని కోరారు. అలాగే భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఎంపీ అర్వింద్ విజ్ఞప్తి చేశారు.అగ్ని ప్రమాదాల వల్ల నష్టపోయిన ఈత చెట్ల వనాలకు తక్షణ నష్టపరిహారం అందించాలని ఆయన పట్టుదలగా డిమాండ్ చేశారు.

# వృద్ధుడు అదృశ్యం -

ఆచూకీ కోసం పోలీసుల గాలింపు



**కరీంనగర్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుజురాబాద్ మామిండ్లవాడకు చెందిన ఎస్.కె. సాహెబ్ హుస్సేన్ (75) మే 19వ తేదీ బుధవారం సాయంత్రం ఇంటి నుండి బయటకు వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు.పోలీసులు మిస్సింగ్ కేసు దర్యాప్తు ప్రారంభించి, ఆచూకీ కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.


# పాకిస్తాన్‌తో విడదీయరాని బంధం ఉంది : జిన్‌పింగ్



**బీజింగ్ మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాకిస్తాన్‌తో తమకు విడదీయరాని బంధం ఉందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. పాకిస్తాన్ ప్రధాని చైనా పర్యటనలో భాగంగా సోమవారం బీజింగ్‌లో ఆ దేశాధ్యక్షుడితో భేటి అయ్యారు. చైనా పరిగణించే ప్రత్యేక దేశాల సమూహంలో పాకిస్తాన్ ఒకటి. పాక్ సన్నిహిత ఆర్థిక, వాణిజ్య, భద్రతా సహకారంతో కూడిన సంబంధాలతో, అన్ని కాలాలకు అనువైన వ్యూహాత్మక భాగస్వామి అని జిన్‌పింగ్ అన్నారు. కాగా, గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్ భవనంలో పాక్ ప్రధాని షరీఫ్‌కు చైనా అధ్యక్షుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ షరీఫ్‌ని ఓల్డ్ ఫ్రెండ్ అని పిలిచారు. పాక్ -- చైనా ఇరు దేశాలు దశాబ్దాలుగా ఒకదానికొకటి అర్థం చేసుకుని, విశ్వసించి, మద్దతు ఇచ్చుకుంటూ, విడదీయరాని సాంప్రదాయ స్నేహాన్ని ఏర్పరచుకున్నాయని జిన్‌పింగ్ అన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు ఎలా ఉన్నా.. చైనా ఎల్లప్పుడూ చైనా -- పాకిస్తాన్‌ల అభివృద్ధికి, దౌత్య సంబంధాలకే ప్రాధాన్యతనిస్తుందని ఆయన అన్నారు. ఉమ్మడి భవిష్యత్తుతో మరింత ఐక్యతతో చైనా-పాకిస్తాన్ సమాజాన్ని నిర్మించడానికి ఇస్లామాబాద్‌తో కలిసి పనిచేయడానికి బీజింగ్ సిద్ధంగా ఉంది అని జిన్‌పింగ్ అన్నారు. ఈ సందర్భంగా షరీఫ్ పాక్- చైనాలు సాటిలేని సంబంధం కలిగిన రెండు ఉక్కు సోదర దేశాలుగా అభివర్ణించారు.

## యూపీలో బక్రీద్ వేళ రోడ్లపై
# నమాజ్, జంతుబలి నిషేధం..
### - సీఎం యోగి ఆదిత్యనాథ్ వార్నింగ్

**న్యూఢిల్లీ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




దేశంలోని ముస్లింలంతా బక్రీద్‌కు సిద్ధమవుతున్న వేళ ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక సూచనలు చేశారు. యూపీలోని రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాలలో నమాజ్ చేయడాన్ని, జంతు బలులను నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూపీలో బక్రీద్ నిర్వహణపై ఆదివారం సీఎం యోగి.. ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు.అనంతరం బక్రీద్‌పై అధికారులకు కీలక సూచనలు చేశారు. పది అంశాలను సూచిస్తూ, వాటిని అమలు చేయాలన్నారు. ఆయన ఆదేశాల ప్రకారం.. మసీదులలో మినహా ఎక్కడా నమాజ్ చేయడానికి వీల్లేదు. రోడ్లపై లేదా పబ్లిక్ ప్లేసులు వంటి ఎలాంటి బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ చేయకూడదు. అలాగే, జంతు బలులు కూడా నిషేధం. రోడ్లను బ్లాక్ చేయకూడదు. ఒకవేళ ప్రార్థనలు చేసే వాళ్లు ఎక్కువ సంఖ్యలో ఉంటే, షిఫ్టుల వారీగా చేసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో జంతు బలులు చేయకూడదు. అలాగే, నిషేధించిన జంతువులను వధించినా కూడా చర్యలు తీసుకుంటారు. జంతుబలుల తర్వాత ఆ ప్రదేశాల్ని పూర్తి పరిశుభ్రంగా ఉంచాలి. ఎలాంటి అపరిశుభ్రతకు తావివ్వకూడదు. చెత్త, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకూడదు. అలాగే, అవాంఛిత ఘటనలకు పాల్పడేవారిపై, శాంతి భద్రతలకు విఘాతం కల్పించేవారిపై కఠినంగా వ్యవహరించాలి. తగినంతగా భద్రతను మోహరించాలి. ముఖ్యంగా సున్నిత ప్రాంతాలను గుర్తించి భద్రత పెంచాలి. సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతరం శాంతి భద్రతల్ని పర్యవేక్షించాలి.

# నేషనల్ హైవే అథారిటీకి దక్కని ఊరట
### రైతులకు మద్దతుగా సుప్రీం తీర్పు



**న్యూఢిల్లీ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భూ వివాదంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై 'స్టే' ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. భూములు కోల్పోయిన యజమానులు పెంచిన నష్ట పరిహారాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు ఆర్డర్‌పై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు ససేమిరా అంది. యాదాద్రి - వరంగల్ నేషనల్ హైవే భూసేకరణ వివాదంలో భూ యజమానులకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో హైకోర్టు ఆదేశాలు యథాతథంగా సుప్రీంకోర్టు ఉంచినట్లు అయింది. దాంతో రైతులకు భారీ ఉపశమనం కలిగినట్లు అయింది. అలాగే అధికారులు పెంచిన నష్టపరిహార మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చని రైతులకు వెల్లడించింది. నగదు విత్‌డ్రా చేసుకుంటే తర్వాత రికవరీ కష్టమన్న ఎన్‌హెచ్ఏఐ వాదనను ఈ కేసు విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. కేవలం ఆర్థిక భారాన్ని సాకుగా చూపి భూ బాధితులకు అందాల్సిన న్యాయమైన పరిహారాన్ని ఆపలేరని స్పష్టం చేసింది. కోర్టు విధించిన షరతులకు లోబడి పెరిగిన పరిహారం మొత్తాన్ని తెలంగాణ భూయజమానులు విత్‌డ్రా చేసుకోనున్నారు.

# నిధుల సేకరణలో సైయెంట్ సెమికండక్టర్స్



**న్యూఢిల్లీ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రముఖ చిప్‌ల తయారీ సంస్థ సైయెంట్ సెమికండక్టర్ మరోసారి నిధులను సమీకరించింది. ఎడల్‌వైస్ నుంచి 30 మిలియన్ డాలర్లు లేదా రూ.286 కోట్ల నిధులను సేకరించినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. అంతర్జాతీయంగా చిప్‌ల వ్యాపారాన్ని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ నిధులను సేకరించినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.వీటిలో 10 మిలియన్ డాలర్లు ఈక్విటీ పెట్టుబడులు కాగా, 20 మిలియన్ డాలర్ల నిధులు డెబిట్‌గా తీసుకున్నది

# అక్రిడేషన్ కార్డులు నిజమైన జర్నలిస్టులకే ఇవ్వాలని జెఎస్ఎస్ డిమాండ్



**పెద్దపల్లి, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని జర్నలిస్టుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అనర్హులు అక్రిడేషన్ కార్డులు పొందుతున్నారని, రేషన్ షాప్ డీలర్లు, వ్యాపారస్తులు 30--40 వేల రూపాయల వరకు చెల్లించి అక్రిడేషన్లు పొందుతున్నారని ఆరోపించారు. ఒక సంస్థలో పని చేస్తూ వేరొక సంస్థ ద్వారా అక్రిడేషన్ పొందడం, క్రిమినల్ కేసులు ఉన్నవారికి కూడా కార్డులు ఇవ్వడం నిజమైన జర్నలిస్టులకు అన్యాయం అవుతోందని అన్నారు.ప్రభుత్వ ఉద్యోగాల నియామకంలో ఎస్పీ ఎంక్వైరీ, ఇంటెలిజెన్స్ ధృవీకరణ జరుగుతున్నట్లే జర్నలిస్టులపై కూడా ఎంక్వైరీ చేసి, అర్హతలు ధృవీకరించిన తర్వాతే అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అక్షరజ్ఞానం లేని వారు, వార్తలు రాయనివారు జర్నలిస్టులుగా గుర్తింపు పొందడం సరికాదని, వారిని తొలగించాలని జెఎస్ఎస్ స్పష్టం చేసింది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే నిజమైన వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం చేస్తూ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వెన్నంపల్లి శ్రీనివాస్ కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జాతీయ కార్యదర్శి సబ్బితం లక్ష్మణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శులు వోడ్నాల లత, కస్నూరి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వోడ్నాల తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘు, ఉపాధ్యక్షులు రావుల రాజకుమార్, ప్రచార కార్యదర్శి అనిల్, జిల్లా కోశాధికారి ఉమేష్, సుమన్ టీవీ లావణ్య రెడ్డి, జెఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.నిజమైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, అనర్హులను తొలగించాలని జెఎస్ఎస్ పట్టుదలగా డిమాండ్ చేసింది.

## ఫ్రాన్స్ నుంచి మరో 114
# యుద్ధ విమానాల కొనుగోలు..
### లేఖను సిద్ధం చేసిన కేంద్రం



**న్యూఢిల్లీ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వైమానిక దళాన్ని మరింత శక్తిమంతంచేసే దిశగా భారత రక్షణశాఖ కీలక ముందడుగు వేసింది. ఫ్రాన్స్ నుంచి మరో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన అధికారిక ప్రతిపాదన లేఖను కేంద్రం సిద్ధం చేసింది. రాబోయే కొన్నిరోజుల్లోనే ఆ లేఖను ఫ్రాన్స్ ప్రభుత్వానికి పంపించనున్నట్లు రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ భారీ రక్షణ ఒప్పందంలో భాగంగా దాదాపు 90 యుద్ధ విమానాలను 'మేకిన్ ఇండియా' కింద ఇక్కడే తయారు చేయనున్నారు.ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్.. ఓ భారతీయ భాగస్వామ్య సంస్థతో కలిసి వీటిని మన దేశంలోనే ఉత్పత్తి చేస్తుంది. మిగిలిన విమానాలను మాత్రం నేరుగా ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకుంటారు. మన లేఖకు ఫ్రాన్స్ స్పందించిన తర్వాత అధికారికంగా టెండర్ ప్రక్రియ ముందుకు సాగుతుంది. భారతదేశ రక్షణ అవసరాలకు సరిపోయేలా రఫేల్ విమానాల్లో కనీసం 50 శాతం మేర స్వదేశీ సాంకేతికత, విడిభాగాలను ఉపయోగించాలని ఢిల్లీ గట్టిగా పట్టుబడుతోంది. ఈ రఫేల్ ఉత్పత్తి ప్రక్రియలో భారతీయ కంపెనీల పాత్రను మరింత విస్తృతం చేయాలని ఫ్రాన్స్‌ను కోరింది. భవిష్యత్తులో జరగబోయే రక్షణ సహకారాలు కేవలం కొనుగోళ్లకే పరిమితం కాకుండా ఇరు దేశాలు కలిసి డిజైన్, అభివృద్ధి చేసేలా ఒప్పందాలు ఉండనున్నాయి. భారత వైమానిక దళంలో ఇప్పటికే 36 రఫేల్ యుద్ధ విమానాలు సేవలందిస్తున్నాయి. అలాగే నౌకాదళం కోసం మరో 26 రఫేల్-ఎమ్ విమానాల కొనుగోలు ప్రక్రియ కూడా నడుస్తోంది. ఇప్పటికే మనదేశంలో రఫేల్ విమానాలకు సంబంధించిన మెయింటెనెన్స్, శిక్షణ మౌలిక వసతులు ఉండటంవల్ల మరిన్ని కొత్త విమానాలు వస్తే వాటి రవాణా, నిర్వహణ ఖర్చులు, పైలట్ల శిక్షణ వ్యయం భారీగా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.ఈ విమానాల కొనుగోలు ప్రతిపాదనకు 'డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్' ఇప్పటికే ప్రాథమిక క్లియరెన్స్ ఇచ్చింది. ఇప్పుడు పంపించబోయే లేఖకు ఫ్రాన్స్ నుంచి ధరలు, డెలివరీ సమయం, లాజిస్టిక్స్ మద్దతు వంటి వివరాలతో సమాధానం వస్తుంది. ఆ తర్వాత ఇరుదేశాల మధ్య తుది చర్చలు జరుగుతాయి. ఈ రక్షణ ఒప్పందంపై సంతకాలు చేయడానికి ముందు ప్రధాని నేతృత్వంలోని 'క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ' తుది ఆమోదం తెలపాల్సిన అవసరం ఉంది.

# ఘనంగా తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ పోస్టర్ విడుదల



**అమ్రాబాద్, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు జక్క రామస్వామి ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉందని, దాన్ని రక్షించుకోవడానికి ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, మేధావులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అందరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.దేశంలో బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యను కాషాయకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ చేస్తూ బడుగు బలహీన వర్గాలకు విద్యను అందకుండా చేస్తున్న కుట్రను అర్థం చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వం పబ్లిక్ పాఠశాలల పేరుతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు బీజం వేస్తోందని, ఇవి కొంతమంది విద్యార్థులకు మాత్రమే నాణ్యమైన విద్య అందిస్తాయని, ప్రభుత్వ పాఠశాలల్లోని మొత్తం విద్యార్థులకు గుణాత్మక విద్య అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.జూన్ 5, 2026న హైదరాబాద్ ఇందిరా పార్కులో ధర్నా ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మేధావులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొని విద్యా ఉద్యమాన్ని బలపరచాలని ఆయన కోరారు. అచ్చంపేటలో జరిగిన పోస్టర్ విడుదల కార్యక్రమంలో డిటి నాయక్, మోతిరాం, విజయ్, శ్రీశైలం, రామకోటి, లక్ష్మీనారాయణ, జనార్ధన్, సురేష్, వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ విద్యను కాపాడుకోవడమే తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన లక్ష్యమని ఈ కార్యక్రమంలో స్పష్టం చేశారు.

# పాక్ ప్రధాని షరీఫ్‌కు అవమానం..
### పాక్ సైన్యాధ్యక్షుడి పేరు ప్రస్తావించి ప్రధానిని మరిచిన ట్రంప్



**న్యూఢిల్లీ, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు అవమానం జరిగింది. ఈసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షరీఫ్‌ను అవమానించారు. ట్రంప్ ఏర్పాటు చేస్తున్న అబ్రహం అకార్డ్స్‌లో చేరాల్సిందిగా ట్రంప్ పాకిస్తాన్‌ను కోరాడు. తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్ వేదికగా ఈ విజ్ఞప్తి చేశాడు. అయితే, ఇందులో పాకిస్తాన్‌ను నడిపించే ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేరు ప్రస్తావించలేదు. పాక్ సైన్యాధ్యక్షుడు అసిమ్ మునీర్ పేరును ట్రంప్ ప్రస్తావించాడు.ట్రంప్ ఇలా పాక్ ప్రధాని పేరునే ప్రస్తావించకపోవడం అంటే ఆయనను ఘోరంగా అవమానించినట్లే అనే చర్చ జరుగుతోంది. ఎందుకంటే అంతర్జాతీయంగా దేశాధినేతల్ని ప్రస్తావించేటప్పుడు ఎవరైనా ప్రోటోకాల్ ఫాలో అవుతారు. అక్కడి రాజ్యాంగం ప్రకారం దేశంలో ఎక్కువ అధికారాలు ఉన్న వారిని ముందుగా ప్రస్తావిస్తారు. పాక్‌లో ప్రధానికే అత్యధిక అధికారాలు ఉంటాయి. సైన్యాధ్యక్షుడికి పాలనపై అంతగా పట్టు ఉండదు. ఆయన సైన్యం వరకే పరిమితం. కాకపోతే, పాక్‌లో అప్పుడప్పుడూ సైనిక పాలన నడుస్తుంటుంది కాబట్టి.. అక్కడ సైన్యాధ్యక్షుడికి విలువ ఎక్కువ. అంతమాత్రాన ఆయన ప్రధానికంటే తక్కువ కాదు. అలాంటిది ప్రధాని పేరు ప్రస్తావించకుండా, సైన్యాధిపతి పేరును ప్రస్తావించడం అంటే ట్రంప్ కావాలనే షెహబాజ్ షరీఫ్‌ను అవమానించినట్లు అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఇక్కడ ట్రంప్ పోస్ట్ ప్రకారం.. అబ్రహం అకార్డ్స్‌లో చేరేందుకు వివిధ ముస్లిం దేశాధినేతలతో మాట్లాడినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏ దేశంలో ఎవరితో మాట్లాడారో ట్రంప్ ప్రస్తావించారు. అలా పాకిస్తాన్‌లో అసిమ్ మునీర్‌తో మాట్లాడినట్లు చెప్పారు. అయినప్పటికీ ఈ అంశంపై పాక్ ప్రధానిని పక్కనబెట్టి సైన్యాధ్యక్షుడితో ట్రంప్ చర్చించడం మరో వివాదానికి దారి తీసింది. ఇజ్రాయెల్‌ను, ఇతర ముస్లిం దేశాలను కలిపి ట్రంప్.. అబ్రహం అకార్డ్స్ ఏర్పాటు చేశారు. దీనిపై 2020లో ఒక ఒప్పందం కుదిరింది. దీన్ని బలోపేతం చేసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇతర ముస్లిం దేశాలు ఈ సమూహంలో చేరాలని ట్రంప్ కోరుతున్నారు. అయితే, ఏ ముస్లిం దేశం ఎలా స్పందిస్తుందో చూడాలి.